భవిష్యత్ ప్రజాపాలన
మా వార్త రేపటి భవిష్యత్తుకు నిదర్శనం
తెలుగు దినపత్రిక
ASN NEWS
bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in
ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 202 గురువారం, ఆగస్టు 20, 2026, పేజీలు - 12 వెల : 1 /-

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

● బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి ● వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి ● బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి సూచన



**హైదరాబాద్,ఆగస్టు 19 :** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఓ÷ూఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. కింద రూ.4,463 కోట్ల విలువైన

మిగతా2లో...



# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

**భూసేకరణలో బాధితులను పట్టించుకోరా..?**

**కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

**హైదరాబాద్,ఆగస్టు 19 :** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలం గాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను

మిగతా2లో...



# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

**అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు**

**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్**

**న్యూఢిల్లీ,ఆగస్టు 19 :** లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర

మిగతా2లో...

## సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం



- ప్రజలతో మమేకమే లక్ష్యంగా పీఏసీ సమావేశం

**నిజామాబాద్, ఆగస్టు 19 :** జిల్లా కేంద్రంలోని దుబ్బలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పీఏసీ సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

మిగతా2లో...


# కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

● కోవిడ్ రికార్డుల దాపరికం నిజమేనని ఒప్పుకోలు ● నవంబర్ 12న శిక్ష ఖరారు చేయనున్న కోర్టు ● ప్రపంచవ్యాప్త తప్పిదాన్ని చైనాపైకి నెట్టే ప్రయత్నంవెల్లడవుతున్న వాస్తవాలు..అమెరికా ఫెడరల్ కోర్టులో నేరాన్ని అంగీకరించిన ఫౌచీ సలహాదారు డేవిడ్ మోరెన్స్



**గ్రీన్‌బెల్ట్ (మేరీల్యాండ్),ఆగస్టు 19 :** కోవిడ్ మహమ్మారి చైనా లేబొరేటరీస్ నుంచి ప్రపంచంలోకి విస్తరించిందని అమెరికా చేసిన ప్రచారం అవాస్తవమని తేలిపోయింది. తాను చేసిన తప్పుల్ని చైనా మీదకు నెట్టి, ఆ దేశాన్ని అభాసుపాలు చేయాలనే ప్రయత్నాల గుట్టురట్టు అయ్యింది. కోవిడ్ సమయంలో అంతటి దుష్ప్రచారం తమ దేశంపై జరుగుతున్నా, చైనా భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టిందే తప్ప, ఏనాడు ఏ దేశాన్ని నిందించలేదు. దీనితో భారతదేశంలో కూడా చైనా లేబరేటరీల నుంచే కోవిడ్ మహమ్మారి వచ్చిందనే ప్రచారాన్ని

మిగతా2లో...




## ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

● ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి ● పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి ● అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం



**హైదరాబాద్,ఆగస్టు 19 :** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న

మిగతా2లో...

## అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట

- ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం




## పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

**సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు**

**సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ**




# ప్రశ్నిస్తే..అరెస్టులా?

● మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని హౌస్ అరెస్ట్

● నివాసాల వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**హైదరాబాద్,ఆగస్టు 19 :** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదారబాద్ సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసానిని పోలీసు లు హౌస్ అరెస్టు చేశారు. కోకాపేట్‌లోని హరీశ్‌రావు నివాసం వద్ద నార్సింగి ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా హరీశ రావు మాట్లాడుతూ... ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దారుణమన్నారు.

కోకాపేటలోని హరీశ్‌రావు నివాసానికి నార్సింగ్ పోలీసులు వెళ్లి, వారిని బయటికి వెళ్లకుండా ముందుగానే హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్ట్ విషయాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

మిగతా2లో...

# 22/ఏ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22/ఏభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

22/ఏ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

# ప్రశ్నిస్తే..అరెస్టులా?

(మొదటి పేజీ తరువాయి)

అక్కడికి చేరుకుని అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు ఆస్పత్రి సందర్శనకు వెళ్లకుండా ఎలాంటి అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు. ఆస్పత్రుల్లోని డొల్లతనం, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతా యనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అరెస్టులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై నిరంతరం బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు.

## ఎమ్మెల్యే తలసాని హౌజ్ అరెస్ట్

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకవైపు ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు అక్రమ నిర్బంధాలు, తప్పుడు కేసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు ఆస్పత్రిని సందర్శించకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆస్పత్రి సందర్శనకు వెళ్తామంటే ప్రభుత్వానికి ఎందుకంత భయమని నిలదీశారు. అక్రమ నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలనే ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యలకు త్వరలోనే ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# అర్హులు ఓటరు జాబితాలో..అనర్హులు జాబితా బయట

**హైదరాబాద్,ఆగస్టు 19 :** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు.

అనామలీస్, నో- మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

క్లెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు.

ఫారం 6, 6ం, 7, 8పై క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

## - సంస్కరణలపై సుప్రీంలో విచారణ



**న్యూఢిల్లీ,ఆగస్టు 19 :**నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# టేబుల్‌పై డీఎంకె అవినీతి ఫైల్స్

## వాటిని అప్పడే తెరిచేలా చేయకండి

## తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై,ఆగస్టు 19 :**ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

(మొదటి పేజీ తరువాయి)

మోడీ సర్కారు నిరోధించేచర్యలు చేపట్టలేదు. కాలం గిర్రున తిరిగి, నిజం నిలకడ మీద ప్రపంచానికి తెలిసి వస్తున్నది. అసలు కోవిడ్ వైరస్‌పై ప్రయోగాలు చేసింది అమెరికానే అనీ, ఆ దేశం దానికోసం నిధుల్ని కూడా సమకూర్చిందని ఆ ఆపరేషన్‌లో భాగస్వాములు అయిన మాజీ అధికారులు ఇప్పుడు స్పష్టంచేస్తున్నారు. దీనిపై అమెరికాలో నమోదైన కేసుల్లో ఇప్పటికే పలువురు అరెస్టు అయ్యారు. కరోనా పరిశోధనలకు అమెరికా నిధులు సమకూర్చిం దని ఆ దేశ మాజీ అధికారి అంగీకరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాన వైద్య సలహాదారు డాక్టర్ ఆంథోనీ ఫౌచీ వద్ద సలహాదారుగా పని చేసిన డేవిడ్ మోరెన్స్ ఈ విషయాన్ని బహిరంగంగా వెల్లడించారు.కొవిడ్ వైరస్‌పై పరిశోధనలకు వెచ్చించిన నిధుల రికార్డులు, ఇతర పత్రాలను అధికారిక సిస్టమ్‌లో కాకుండా, చట్టాల నుంచి తప్పించుకోవడానికి వ్యక్తిగత ఇ-మెయిల్స్‌లో దాచినట్లు పేర్కొన్నారు. కొవిడ్ పరిశోధన గ్రాంట్లకు సంబంధించి ఏప్రిల్ 2020 నుంచి ఏజెన్సీకి అందిన ప్రజా రికార్డుల అభ్యర్థనలను అడ్డుకున్నట్లు డేవిడ్ మోరెన్స్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ఆయనను విచారించగా.. తన తప్పును అంగీకరించారు. కోవిడ్ మహమ్మారి మొదలైన సమయంలో ఆంథోనీ ఫౌచీ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' (ఎన్ఐఏఐడీ) అధిపతిగా ఉండగా, తాను సహాయకుడిగా ఉన్నానని ఫెడరల్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మోరెన్స్ పేర్కొన్నారు. వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్-19 ఉద్భవించిందన్న ఆరోపణల నేపథ్యంలో.. గబ్బిలాల్లోని కరోనా వైరస్‌లపై చేస్తున్న పరిశోధన గ్రాంటును నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ రద్దు చేయాలని నిర్ణయించుకుంది.అయితే, ఆ గ్రాంటును పునరుద్ధరించడానికి ల్యాబ్ నుంచి కొవిడ్ లీక్ అయిందన్న విషయాన్ని తప్పుడు కథనంగా చూపేలా సాయం చేస్తానని మోరెన్స్ చైనాలోని యాజమాన్యానికి హామీ ఇచ్చారని ప్రాసిక్యూటర్లు తెలిపారు. అందులో భాగంగానే కరోనా సహజసిద్ధంగా, జంతువుల నుంచే వ్యాప్తి చెందిందనే వాదనను బలంగా ప్రచారం చేయించారన్నారు. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు వారు ప్రభుత్వ ఇ-మెయిల్ ఖాతాకు బదులుగా మోరెన్స్ వ్యక్తిగత ఖాతాను ఉపయోగించి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు గుర్తించామన్నారు. దీంతో ఈ విషయంపై ఆంథోనీ ఫౌచీని కూడా విచారించే అవకాశం ఉంది. కరోనాపై ప్రమాదకర పరిశోధనల కోసం చైనాలోని వుహాన్ ప్రయోగశాలకు అమెరికా నుంచి నిధులు అందాయని, ఆ వైరస్ పుట్టుకపై వాస్తవాలను అగ్రరాజ్య ఉన్నతస్థాయి వ్యక్తులు తొక్కిపెట్టారని జూన్‌లో అమెరికా మాజీ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్ వెల్లడించారు. ఈ మొత్తం కుట్ర వెనుక ఉన్న వ్యక్తి.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రధాన వైద్య సలహాదారుగా పనిచేసిన ఆంథోనీ ఫౌచీ అని పేర్కొన్నారు. త్వరలో ఫౌచీని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది. ఈ కేసు విచారణలో కోవిడ్ మూలాల రికార్డులు దాచేందుకు కుట్ర పన్నినట్టు డేవిడ్ మోరెన్స్ చెప్పడం వల్ల ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలో దీనిపై చర్చకు ప్రాధాన్యత ఏర్పడింది. అమెరికా అసలు రంగు బయటపడుతున్నదని పలు దేశాల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

**అమరావతి,ఆగస్టు 19 :**

వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటో జర్నలిస్ట్‌గా మారారు. ఫొటో జర్నలిస్ట్‌లు అందరిని కలిపి సీఎం గ్రూప్ ఫొటో తీశారు. కెమెరా తీసుకుని తానే ఫొటో తీస్తానని చెప్పారు. వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఫొటో జర్నలిస్ట్‌లు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ.. జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు సీఎం అభినందనలు తెలిపారు. మానవ అనుభవాలను, అద్భుతమైన చిత్రాలుగా ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు చెప్పారు. మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల అంకితభావం, కళాత్మకత, నిరంతర కృషి అభినందనీయమని ప్రశంసించారు.

# సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పీఏసీ సభ్యులు, డీసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమే లక్ష్యంగా ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.

క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృథా

(మొదటి పేజీ తరువాయి)

లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయ పడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

- సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



**హైదరాబాద్,ఆగస్టు 19 :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

# పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై రాస్తారోకో





**జనగామ, ఆగస్టు 19 (భవిషత్ ప్రజాపాలన):** పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జీవో నంబర్ 95ను వెంటనే రద్దు చేయాలని, 'శక్తి' స్కీమ్‌ను ఉపసంహరించుకోవాలని టీఆర్పీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వెంపటి అజయ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని జిల్లా యువజన అధ్యక్షుడు పిట్టల సురేష్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి చెన్నూర్ వంశీ, ఉపాధ్యక్షుడు యామంకి విజయ్, పట్టణ సంయుక్త కార్యదర్శి సల్మాన్, నాయకులు బాలశివుడు, అద్భుత రాజ్, విజయలక్ష్మి, చంద్రకళ, అనిత, శృతి, మమత తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం...



**భవిష్యత్ ప్రజాపాలన ఆగస్టు19 పాలకుర్తి:** పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు గుడి కందుల నరేష్ ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు, ఈ సందర్భంగా మాట్లడుతూ ఫోటోగ్రాఫర్లు అందరూ ఐకమత్యంతో ఉండి సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్ రాపోలు లక్ష్మణ్ కు ఘనంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు..

# G.O 97 శక్తి పథకం రద్దు చెయ్యాలి

**పాలిటెక్నిక్ విద్యార్థుల** G.O.**97 రద్దు** డిమాండ్‌పై చేపట్టిన నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వకపోవడం తీవ్రంగా ఖండనీయం. విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్‌ను **ప్రజాస్వామ్య పద్ధతిలో** తెలియజేయడానికి నిరసన చేపడితే, స్పీకర్ పర్యటన ఉందనే కారణంతో అనుమతి నిరాకరించడం ఎందుకు? అని ప్రశ్నిస్తూ వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ **మెతుకు ఆనంద్** గారు విద్యార్థుల **నిరసనకు సంఘీభావం** తెలిపారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును వినాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. విద్యార్థుల డిమాండ్‌ను ప్రభుత్వం, అధికారులు సీరియస్‌గా తీసుకుని G.O. **97ను వెంటనే రద్దు** చేయాలి.

**స్పీకర్ పర్యటన కంటే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం!**

**అనుమతులు నిరాకరించడం కాదు... విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపాలి!**



# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తదుపరి దశను పకడ్బందీగా చేపట్టాలి




**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ "సి.నారాయణ రెడ్డి"**

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, భవిష్యత్ ప్రజాపాలన, సీనియర్ జర్నలిస్ట్ వినోద్ కుమార్:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తదుపరి దశను పకడ్బందీగా చేపట్టాలి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీలపై ప్రత్యేక దృష్టి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో తదుపరి దశలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలన, మ్యాపింగ్ ప్రక్రియలో నమోదైన వివిధ కేటగిరీల కేసుల వివరాలను సమీక్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, తదుపరి దశలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అలాగే హై మ్యాపింగ్, నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లు, ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షలకు పైగా కేసులు వివిధ కేటగిరీల కింద ఉన్న నేపథ్యంలో, ఈ భారీ పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం వద్ద కూడా సంబంధిత కేటగిరీలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి అవసరమైన తదుపరి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. తదుపరి దశలో సుమారు 93 లక్షల కేసుల పని భారం ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇందులో సుమారు 32 లక్షల కేసులు నో మ్యాపింగ్ కేటగిరీకి, సుమారు 60 లక్షల కేసులు అనామలీస్ కేటగిరీకి సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. అనామలీస్ కేటగిరీ కేసులు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, హైదరాబాద్ తోపాటు ఇతర పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీలు అధికంగా ఉన్న జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచించారు. జిల్లాల వారీగా కేసుల సంఖ్య, అందుబాటులో ఉన్న సిబ్బంది, నియోజకవర్గాల వారీగా పని భారాన్ని పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. అదనపు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (Additional EROs), ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (EROs) తమ పరిధిలోని పని భారాన్ని సమన్వయంతో పంచుకుని కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి కేటగిరీకి సంబంధించిన కేసులను నిర్ణీత విధానంలో పరిశీలించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేసుల పరిష్కారంలో భాగంగా నోటీసుల జనరేషన్, నోటీసుల ప్రింటింగ్, సంబంధిత వ్యక్తులకు నోటీసుల జారీ, నోటీసు కాలవ్యవధిలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిశీలన, తుది పరిష్కారం వంటి ప్రతి దశను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. భారీ సంఖ్యలో ఉన్న కేసులను దృష్టిలో ఉంచుకుని జిల్లాల వారీగా స్పష్టమైన బాధ్యతలు కేటాయించి, EROలు, అదనపు జు=ాలు మరియు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్న నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీ కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి, మొత్తం ప్రక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న




జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, నాన్-మ్యాపింగ్ కేసులను సమగ్రంగా పరిశీలించి, అర్హత కలిగిన ఓటర్ల వివరాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మ్యాపింగ్, నాన్-మ్యాపింగ్‌కు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చోట సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలన, సర్వే, అనంతరం వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సుమారు 5.60 లక్షల నాన్-మ్యాపింగ్ కేసులు, 6.70 లక్షల మ్యాపింగ్ నాన్-మ్యాపింగ్‌కు సంబంధించిన కేసులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా సుమారు 2.73 లక్షల సేవింగ్స్/నాన్-మ్యాపింగ్ కేటగిరీ కేసులు ఉన్న నేపథ్యంలో వాటిని కూడా ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 85 రోజుల సమయం ఉన్నందున, ఈ ప్రక్రియను పకడ్బందీగా, సమగ్రంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న కేసులను గుర్తించి, ఎన్ని నోటీసులు జారీ చేయాలి, ఎవరికి నోటీసులు ఇవ్వాలి, తదుపరి చేపట్టాల్సిన చర్యలు ఏమిటనే అంశాలపై అధికారులు పోలింగ్ స్టేషన్ వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈరోజు సాయంత్రం నుంచే నోటీసుల జారీ ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రేపటి నుంచి ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. నోటీసుల జారీ అనంతరం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సంబంధిత వివరాలను పరిశీలించి, పునఃపరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలో అధిక సంఖ్యలో కేసులు ఉన్న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అధిక సంఖ్యలో కేసులు ఉన్న ప్రాంతాల్లో ముందుగా చర్యలు చేపట్టి, అవసరమైన వివరాలను వీలైనంత త్వరగా సేకరించి సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని కేసులను క్షుణ్ణంగా గుర్తించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, నిర్ణీత గడువులోగా నోటీసుల జారీతో పాటు తదుపరి పరిశీలన, సర్వే, పునఃపరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియలను సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి కేసును నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ వివరాలను నిర్ధారించిన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉండేలా, ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, ఈ ఆర్ ఓలు, ఏ ఈ ఆర్ ఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశ మార్పుకు చోదకశక్తి

## 'యంగ్ వాయిస్' సదస్సులో వక్తలు




**హైదరాబాద్, ఆగస్టు 17 (భవిషత్ ప్రజాపాలన ):** సమాజంలోని సమస్యలను ప్రశ్నించడంతో పాటు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పలువురు మేధావులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 3టీవీ నెట్‌వర్క్, సకలం ఆధ్వర్యంలో 'యంగ్ వాయిస్' సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన 3టీవీ గౌరవ సంపాదకుడు రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. యువత ఎప్పటికీ అమ్ముడుపోదని, తమ సమస్యలపై వారికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ప్రశ్నించే, పోరాడే స్ఫూర్తిని యువత కొనసాగించాలని కోరారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల డ్రాపౌట్లపై ఆందోళన వ్యక్తం చేశారు. జెన్‌జీ తరహా ఉద్యమ స్ఫూర్తి అవసరమన్నారు. సైకాలజిస్ట్ విశేష్ మాట్లాడుతూ మార్కులు, ర్యాంకుల ఒత్తిడితో విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలను సామాజికంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థినులపై సోషల్ మీడియా వేధింపులు తదితర సమస్యలను విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్,పీడీఎస్‌యూ, ఏఐడీవైఓ, దిశ,నవజవాన్ భారతసభ, జైభారత్ తదితర సంఘాల నాయకులు ప్రస్తావించారు యువత, విద్యార్థుల సమస్యలకు ప్రభుత్వాలు విధానాలకే పరిమితం కాకుండా ఆచరణాత్మక పరిష్కారాలు చూపాలని సదస్సు డిమాండ్ చేసింది.

# ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ కాంక్లేవ్‌కు కమిషనర్లకు ఆహ్వానం





**హైదరాబాద్, ఆగస్టు 19 (భవిషత్ ప్రజాపాలన ):** ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించ నున్న జాతీయ సదస్సుకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి బుధవారం ఆహ్వానించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం నానక్‌రామ్‌గూడలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపురావు తదితరులు కలిసి కాంక్లేవ్‌కు ఆహ్వానించారు. కమిషనర్‌ను శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రం అందజేశారు. జాతీయ స్థాయిలో తొలిసారిగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తప్పకుండా హాజరవుతానని సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. కాంక్లేవ్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# జీడి సత్యనారాయణ పార్థివ దేహంపై జెండా కప్పి నివాళులర్పించిన



**సిపిఐ ఎంఎల్ నాయకులు...**

**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి రిపోర్టర్ రమేష్:** కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన జీడి బాలయ్య కుమారుడైన జీడి సత్యనారాయణ నేడు అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి జెండా కప్పి పార్టీ శ్రేణులతో ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీడి సత్యనారాయణ పెద్ద కుమారుడు సోమయ్య సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య మండల కార్యదర్శి కొనకటి కళింగరాజు గాయాల బాబు తూర్పాటి సారయ్య అనంతోజు బిక్షపతి పెద్ది రాహుల్ లతోపాటు జీడి సత్యనారాయణ సానుభూతిపరులు భూముల దండయ్య మామిళ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కె. తారక రామారావు చొరవతో

## జన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొత్త భవనం



- ఐదు కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తి,
- నేడు ప్రారంభించనున్న సబితా ఇంద్రారెడ్డి

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 19 జన్వాడ**

**చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం ఈ నెల 20వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా ఐదు కోట్ల రూపాయల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ భవనాన్ని నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత రాష్ట్ర సమితి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మాజీ ఎంపీపీ ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి పత్రిక ప్రతినిధులతో తెలిపారు.

గురువారం , ఆగస్టు 20 , 2026

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



## 22A బాధితుల రక్షణకు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ లీగల్ సెల్ ఏర్పాటు..

# 10 మంది న్యాయవాదులతో ఉచిత న్యాయ సహాయం

- **30% కమీషన్లు, 50-50 సెటిల్మెంట్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ భూములను 22ఏ లో పెట్టింది.**
- **రేవంత్ రెడ్డి, పొంగులేటిలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం తెలిస్తే.. బీఆర్ఎస్ నాయకులకు ప్రజల తరపున పోరాటాలు తెలుసు.**
- **యాదాద్రిలో 40 వేల ఎకరాలు 22Aలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు?**
- **లక్షలాది మంది జీవితాలను రోడ్డున పడేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి.**



తెలంగాణ భవన్‌లో 22A నిషేధిత భూముల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు గారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రా రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన బాధితుల ఆవేదనలను ఓపికగా విన్న హరీశ్ రావు గారు, వారికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసానిస్తూ ప్రభుత్వంపై మండిపడ్డారు.

**మాజీ మంత్రి హరీశ్ రావు గారి కామెంట్స్...**

22A పేరుతో ఇబ్బందులు పడుతున్న బాధితులెవరూ ఆందోళన చెందవద్దు.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గారి నాయకత్వంలో మేమందరం మీకు అన్ని వేళలా అండగా ఉంటాం. బాధితులకు అన్ని రకాలుగా ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో 10 మంది న్యాయవాదులతో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం.. అడ్వకేట్ కళ్యాణ్ (ఫోన్: 812535604) గారిని సంప్రదిస్తే మా లీగల్ సెల్ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తుంది. లీగల్ సెల్ సపోర్ట్‌తో పాటు ఎమ్మెల్యేలుగా మేము కూడా అధికారులతో, కలెక్టర్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యే వరకు మీ వెంటే ఉంటాం. ఎవ్వరూ భయపడి 20%, 30% కమీషన్లు ఇవ్వవద్దు. తక్కువ ధరలకు ఆస్తులు అమ్ముకోవద్దు.. ఎంతటి పోరాటానికైనా సిద్ధపడి ప్రభుత్వం మెడలు వంచి మీ ఆస్తులను రక్షించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుంది. హూడా, హెచ్ఎమ్‌డీఏ అప్రూవ్డ్ లేఅవుట్లలో, 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న ఇళ్లను కూడా ఇప్పుడు 22Aలో పెట్టారంటే.. దీని వెనుక ఎంత పెద్ద కమీషన్ల దందా నడుస్తోందో అర్థమవుతోంది. బుద్వేల్ గ్రామం సర్వే నంబర్ 282, 283, 284 లలోని 30 ఎకరాల భూమి కోసం సర్వే సెటిల్మెంట్ డైరెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే 22A నుంచి క్లియర్ చేసి కోట్లాది రూపాయల దందా చేశారు. శేరిలింగంపల్లి సర్వే నంబర్ 20/1, 21లో SAS ఇన్ఫ్రా ప్రాపర్టీకి 30% కమీషన్ తీసుకుని 22A నుంచి క్లియర్ చేసి రిజిస్ట్రేషన్లు చేయించారు.. బిల్డర్ పని అయిపోయాక మళ్లీ 10 రోజుల క్రితం దాన్ని 22Aలోకి మార్చారు. సంగారెడ్డి సమీపంలో శిల్పా మోహన్ రెడ్డి గారి భూమిని 22ఏ నుంచి తీసి రిజిస్ట్రేషన్లు చేశాక.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిసి మళ్లీ 22Aలో పెట్టించారు.. వీరి ఇష్టారాజ్యంతో కొనుక్కున్న సామాన్యుల జీవితాలు ఏమవ్వాలి. అమీన్‌పూర్ కేఎస్ఆర్ కాలనీలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ 500 ఇళ్లను 22Aలో పెట్టి కాలనీవాసులను ఇబ్బంది పెడుతున్నారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు రియల్ ఎస్టేట్ బాగా తెలవొచ్చు కానీ.. బీఆర్ఎస్ నాయకులకు తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి చేసిన పోరాటాలు బాగా తెలుసు. మాకు పోరాటాలు తెలుసు కాబట్టే.. మీరు 22Aలో పెట్టిన భూములను ఎలా బయటకు తీయించాలో మాకు బాగా తెలుసు, బాధితులకు న్యాయం జరిగే వరకు మిమ్మల్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదు. పొంగులేటి గారు 10 రోజుల క్రితమేమో ఒక్క ఎకరం కూడా 22A లో పెట్టలేదు అన్నారు.. నిన్ననేమో అధికారులు పొరపాటు చేశారు సారీ అంటున్నారు.. ఎంత దూప్లికేట్ మాటలు మాట్లాడుతున్నారు? యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22Aలో పెట్టారని నాలుగు నెలల క్రితమే స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రికి చెప్పినా రేవంత్ రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు. అంటే ఇదంతా రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇద్దరూ కూడబలుక్కుని ఆడుతున్న వసూళ్ల నాటకమని స్పష్టంగా అర్థమవుతోంది. చిన్న చిన్న విషయాలకే సీఐడీ, విజిలెన్స్ విచారణలు వేసే రేవంత్ రెడ్డి.. లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్న ఈ 22A కుంభకోణంపై సీఐడీ ఎంక్వైరీ ఎందుకు వేయడం లేదు. రేవంత్ రెడ్డికి ఈ దందాతో సంబంధం లేకపోతే.. తక్షణమే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి. తాండూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎకరాల్లో కొని గజాల చొప్పున బకరాలకు అమ్ముతున్నారు అని రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరే కాంగ్రెస్ ప్రభుత్వ అసలు రంగును బయటపెట్టింది. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రజలకు నిద్రలేని రాత్రులు మిగిల్చిన ఈ ప్రభుత్వం ఒక తుగ్లక్ ప్రభుత్వంలా మారిపోయింది. ప్రజలను మీసేవలు, ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పకుండా.. ప్రభుత్వం చేసిన తప్పును ప్రభుత్వమే సుమోటోగా స్వీకరించి ఆన్‌లైన్ నుంచి 22A ఆంక్షలను వెంటనే తొలగించాలి. అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే భూభారతి వెబ్‌సైట్‌ను డౌన్ చేసి, హైదరాబాద్ జిల్లా వివరాలు కనిపించకుండా మాయం చేశారు. 2008లోనే డాక్టర్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో సీలింగ్ రద్దయి, హెచ్ఎమ్‌డీఏ, జీహెచ్ఎంసీ పర్మిషన్లతో కట్టుకున్న ఇళ్లను కూడా ఇప్పుడు సీలింగ్ భూములని చెప్పడం దుర్మార్గం. ఒకటి రెండు రోజులు చూస్తాం.. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున సీఎం ఇల్లు ముట్టడికి సిద్ధమవుతాం. అక్రమంగా నిషేధిత జాబితాలో పెట్టిన భూములన్నింటినీ వెంటనే పునరుద్ధరించాలి.. ఈ కుట్రకు కారకులైన అధికారులపై, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## నైట్రాజెపామ్ టాబ్లెట్ల అక్రమ విక్రయం..

# ముగ్గురి అరెస్ట్




**రాజేంద్ర నగర్:** నైట్రాజెపామ్ టాబ్లెట్ల అక్రమ విక్రయం.. ముగ్గురి అరెస్ట్. 1,840 నైట్రాజెపామ్–10 ఎంజీ టాబ్లెట్లు స్వాధీనం. మూడు సెల్‌ఫోన్లు, రూ. 1,000 నగదు సీజ్. సుమారు రూ. 1.23 లక్షల విలువైన టాబ్లెట్లు స్వాధీనం రూ. 20కి కొనుగోలు.. రూ. 50కి విక్రయం. గార్స్ ఆస్పత్రి సమీపంలో మహ్మద్ అష్ఫాక్ అరెస్ట్, అష్ఫాక్ ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని పట్టుకున్న పోలీసులు. పరారీలో ముగ్గురు ప్రధాన సరఫరాదారులు. NDPS Act కింద కామాటిపుర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు, సరఫరా నెట్‌వర్క్‌పై పోలీసుల దర్యాప్తు ముమ్మరం. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆపరేషన్.

# ఫోటోగ్రాఫర్ల నైపుణ్యాభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ అండ

- **త్వరలో ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు**
- **ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిపుణుల ద్వారా**
- **ప్రత్యేక శిక్షణకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీ**

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** ఫోటోగ్రఫీ రంగం కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విస్తరిస్తోందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియో చిత్రీకరణ కళాకారులకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగం ప్రాధాన్యతను వివరిస్తూ మాట్లాడారు. ఒకప్పుడు ఒక మధురమైన జ్ఞాపకాన్ని చిత్రరూపంలో భద్రపరచడానికే పరిమితమైన ఫోటోగ్రఫీ, నేడు ఆధునిక కెమెరా సాంకేతికత, వీడియో చిత్రీకరణ, డ్రోన్ చిత్రీకరణ, చలనచిత్ర చిత్రీకరణ, చిత్రాల సవరణ, వీడియోల సవరణ, గ్రాఫిక్ రూపకల్పన, సామాజిక మాధ్యమాల కోసం సమాచార రూపకల్పన వంటి అనేక విభాగాలుగా విస్తరించిందన్నారు.



**మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం కెమెరాను వినియోగించడం తెలిసి ఉంటే సరిపోదని, ఆధునిక సాఫ్ట్‌వేర్ వినియోగం, చిత్రాల సవరణ, వీడియోల సవరణ, రూపకల్పన, వీడియో నిర్మాణం, రంగుల సమన్వయం, డిజిటల్ సమాచార రూపకల్పన వంటి నైపుణ్యాలపై కూడా పట్టు సాధించాల్సిన అవసరం ఉందని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కాలంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఫోటోగ్రాఫర్లు, వీడియో చిత్రీకరణ కళాకారులు కూడా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతపై పట్టు సాధిస్తే వృత్తిపరంగా మరిన్ని అవకాశాలు లభించడంతో పాటు ఉపాధి, ఆదాయ అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

**ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ**

కల్వకుర్తి, పరిసర ప్రాంతాల్లోని ఫోటోగ్రాఫర్లు, వీడియో చిత్రీకరణ కళాకారుల నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో ప్రత్యేక ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులను ఏర్పాటు




చేయనున్నట్లు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ శిక్షణలో చిత్రాల సవరణ, వీడియోల సవరణ, గ్రాఫిక్ రూపకల్పన, రంగుల సమన్వయం, చలనచిత్ర చిత్రీకరణ, డిజిటల్ సమాచార రూపకల్పన తదితర ఆధునిక అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.

**ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో ఆచరణాత్మక శిక్షణ**

శిక్షణకు అవసరమైన ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చడంతో పాటు, ఆయా రంగాల్లో నిపుణులైన శిక్షకుల ద్వారా ఆచరణాత్మక శిక్షణ ఇప్పిస్తామని రాఘవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ శిక్షణ కేవలం ధ్రువపత్రం అందించడానికి మాత్రమే పరిమితం కాకుండా, ఫోటోగ్రాఫర్లు తమ వృత్తిలో నేరుగా ఉపయోగించుకునే విధంగా రూపొందిస్తామని చెప్పారు. వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచి, కొత్త ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఫోటోగ్రాఫర్లను తీర్చిదిద్దడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఆయన తెలిపారు. "కాలంతో పాటు సాంకేతికత మారుతోంది. సాంకేతికత మారుతున్న కొద్దీ మన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి. ఫోటోగ్రఫీని వృత్తిగా కొనసాగిస్తున్న వారికి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి నా వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.

**ఫోటోగ్రాఫర్ల హర్షం**

ఫోటోగ్రాఫర్లు, వీడియో చిత్రీకరణ కళాకారులకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఉచితంగా అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ముందుకు రావడం పట్ల యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మరింత పెంచేందుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగినేని రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎం.డి. రియాజ్, ప్రధాన కార్యదర్శి నందు, కోశాధికారి వంశీ, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు, యూనియన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో చిత్రీకరణ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులకు అవగాహన సమావేశం








**కూకట్‌పల్లి జోన్, సైబరాబాద్ కమిషనరేట్:** తేదీ: 19.08.2026 ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులకు అవగాహన మరియు సెన్సిటైజేషన్ సమావేశాన్ని 19.08.2026న ఉదయం 11:00 గంటల నుంచి 12:30 గంటల వరకు ఝఆఒబతీస్త్రఝఎ పోలీస్ స్టేషన్ పరిధిలోని టి-హబ్, నాలెడ్జ్ సిటీలో నిర్వహించారు. ఈ సమావేశం శ్రీమతి రితిరాజ్, IPS, డీసీపీ, కూకట్‌పల్లి జోన్ మార్గదర్శకత్వంలో నిర్వహించబడింది. శ్రీ లక్ష్మీకాంత రావు, అదనపు ఎస్పీ, సిటీ సెక్యూరిటీ వింగ్-ISW, శ్రీ శ్రీకాంత్, అనలిటికల్ ఆఫీసర్, ISW, మరియు శ్రీ చ. శ్రీధర్, ACP, మాదాపూర్ డివిజన్ పాల్గొన్నారు. వివిధ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు చెందిన సుమారు 50 మంది ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ (రెగ్యులేషన్) యాక్ట్, 2005 (PASARA Act) పై అవగాహన కల్పించారు. చెల్లుబాటు అయ్యే PASARA లైసెన్స్ పొందే విధానం, సెక్యూరిటీ గార్డులకు తప్పనిసరి శిక్షణ, శిక్షణ రికార్డుల నిర్వహణ, సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లో నియమించే ముందు పోలీస్/బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ వంటి అంశాలను వివరించారు. PASARA లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన మార్గదర్శకాలు మరియు పత్రాలను ప్రతినిధులకు అందజేశారు. PASARA చట్టం మరియు ఇతర వర్తించే చట్టాలను తప్పనిసరిగా పాటించాలని, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా సెక్యూరిటీ ఏజెన్సీలను నిర్వహించరాదని సూచించారు. ప్రజల భద్రత మరియు రక్షణలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పోషిస్తున్న ముఖ్యమైన పాత్రను అధికారులు వివరించి, అన్ని ఏజెన్సీలు చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. శ్రీ టి. భూపతి, SHO, Raidurgam PS, శ్రీ కె.వి. సుబ్బారావు, SHO, మాదాపూర్ PS మరియు ఇతర ఎస్ఐలు సమావేశంలో పాల్గొని సమన్వయం చేశారు.

## మణికొండలో ఘనంగా VURVI షాప్ ప్రారంభోత్సవం



**మణికొండ:** మణికొండలో నూతనంగా ఏర్పాటు చేసిన VURVIషాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నార్సింగి మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీశ్రీ హాజరై షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన షాప్ నిర్వాహకులకు లక్ష్మీశ్రీ శుభా కాంక్షలు తెలిపారు. వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెంది మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, శైలజ, శ్వేత, వందన, రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి, ప్రియ, శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి బషీర్, శ్రవణ్, మహిళా నాయకులు సావిత్రి, గంగా ఇందిర, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



# మీసేవ ద్వారా టెట్ మెమోల జారీ

**Telangana news :** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) పరీక్షలో క్వాలిఫై అయిన వారికి ముద్రిత మెమోలు జారీచేయనున్నారు. ఇవి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లాగే ఉంటాయి. వీటిని మీ సేవా కేంద్రాల ద్వారా జారీచేస్తారు. సర్టిఫికెట్‌పై ప్రత్యేకంగా ఒక బార్‌కోడ్, నంబర్ సైతం ఉంటాయి. 2011 నుంచి ఇప్పటి వరకు టెట్ పరీక్ష పాసైన వారందరికి ముద్రిత మెమోలు జారీచేస్తామని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఈ మెమోను పొందేందుకు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మెమోపై అభ్యర్థి పేరు, ఫొటో, వేలిముద్ర/ సంతకం, అభ్యర్థి పొందిన మార్కుల వివరాలుంటాయి. గతంలో టెట్ పరీక్ష పాసైన వారికి రెండు సార్లు ముద్రిత మెమోలు జారీచేశారు. ఆ తర్వాత ఆన్‌లైన్ మెమోలను మాత్రమే జారీచేస్తున్నారు. దీంతో కొందరు నకిలీ మెమోలు తయారుచేస్తున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో ముద్రిత మెమోలు జారీచేయాలని నిర్ణయించింది

# ఫిలిప్పీన్స్‌లో ఇండియన్ ఎంబసీని సందర్శించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ

**●మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ**
**●ఉత్తమ వలస విధానాలపై చర్చలు**
**●గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి చేస్తాం**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 19:** తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశరాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. ఆ తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలసవిధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు. ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్‌లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

# దేవేందర్ నగర్-రామంతాపూర్ నాలా అభివృద్ధిపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



**●డీ-సిల్టింగ్, పారిశుద్ధ్యం, పచ్చదనం, ఆక్రమణల తొలగింపుపై సమగ్ర కార్యాచరణకు ఆదేశాలు...**

**ఉప్పల్,ఆగస్టు19:(భవిష్యత్ ప్రజాపాలన):** దేవేందర్ నగర్-రామం తాపూర్ నాలా పరిధిలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి నాలా పరిస్థితి, పరిసరాల పరిశు భ్రత, నీటి ప్రవాహం, మౌలిక వస తుల నిర్వహణను సమీక్షించా రు.ఈ సందర్భంగా నాలా పరిధి లో చేపట్టాల్సిన పనులపై కమిష నర్ సంబంధిత శాఖలకు స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశారు.వి భాగాల మధ్య సమన్వయంతో, నిర్ణీత కాలవ్యవధిలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు....**

నాలాలో పేరుకుపోయిన పూడి కను తొలగించేందుకు డీ-సిల్టింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి వేగవంతంగా పూర్తిచేయా లని కమిషనర్ ఆదేశించారు.వ ర్షాకాలంలో నాలాలో నీటి ప్రవా హానికి ఎలాంటి ఆటంకం కలగ కుండా ముందస్తు చర్యలు చేప ట్టి, నీటి పారుదల వ్యవస్థను స మర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

**పారిశుద్ధ్య విభాగానికి ఆదేశాలు...**

నాలా వెంబడి పేరుకుపోయిన చెత్త,వ్యర్థాలు,లిట్టర్‌తో పాటు వ్య ర్థాలను పూర్తిగా తొలగించేందు కు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చే పట్టాలనిఆదేశించారు.నాలాపరి సరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా




పర్యవేక్షణ పెంచాలని, వ్యర్థాలు తిరిగి పేరుకుపోకుండా అవసరమైన చర్యలు తీసుకో వాలని సూచించారు.

**యూబీడీ విభాగానికి ఆదేశాలు...**

నాలా వెంబడి అనువైన ప్రాంతా లను గుర్తించి పచ్చదనం పెంపొం దించేలా మొక్కలు నాటే కార్యక్ర మాలను చేపట్టాలని కమిషనర్ సూచించారు. అదే సమయంలో నాలా పరిసరాలకు అడ్డంకిగా మారుతున్న అనవసరమైన తీగ లు, అధికంగా పెరిగిన వృక్ష సంప దను తొలగించి ప్రాంతాన్ని శుభ్రం గా, సురక్షితంగా అందుబాటులో ఉండేలా నిర్వహించాలని ఆదే శించారు.

**టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆదేశాలు.....**

నాలా పరిధిలో ఉన్న ఆక్రమణల ను గుర్తించి తొలగించాలని,నా లా మార్జిన్లు ఎలాంటి ఆక్రమణ లు,నిర్మాణాలు లేదా ఇతర అవ రోధాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశిం చారు. నాలా పరిసరాలను ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సురక్షితంగా నిర్వహించాలని సూచించారు.నాలా అభివృద్ధి కేవలం ఒక శాఖ బాధ్యతగా కా కుండా ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం,యూబీడీ,టౌన్ ప్లానింగ్ త దితర అన్ని విభాగాలు సమన్వ యంతో పనిచేయాల్సిన అంశ మని కమిషనర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో జారీ చేసిన ప్రతి ఆదేశంపై సంబంధిత అధికా రు లు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, పనుల పురోగతిని సమీ క్షించా లని సూచించారు.ఈ తనిఖీలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధి కా గుప్తా,ఉప్పల్ డి సి ఆనంద్‌తో పాటు ఎంఎంసీకి చెందిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లెకు పొన్నం.. ప్రజల గడప వద్దకే పాలన

## సైదాపూర్‌లో 'పల్లె పల్లెకు పొన్నం అన్న' ప్రారంభం




**సైదాపూర్, ఆగస్టు 19 (భవిష్యత్ ప్రజాపాలన):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెల్లో ప్రజా పాలన' కార్యక్రమం బుధవారం సైదాపూర్‌లో ప్రారంభమైంది. తొలి రోజు ఏడు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. దుద్దెనపల్లి, ఎక్లాస్‌పూర్, వెన్నెంపల్లిలో రూ.20 లక్షల చొప్పున నిర్మించిన పల్లె దవాఖానలను ప్రారంభించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసి, అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెన్నెంపల్లిలో మహిళా సంఘాలకు రూ.13.50 లక్షల వడ్డీలేని రుణాలు, బ్యాంకు లింకేజీ కింద రూ.4.35 కోట్లు విడుదలైనట్లు తెలిపారు.





రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపాలని సూచించారు. 200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసిన గ్రామపంచాయతీలకు రూ.5 లక్షల అభివృద్ధి నిధులు ఇస్తామని ప్రకటించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరించడమే ప్రజల కార్యక్రమం అని మంత్రి పొన్నం తెలిపారు.

# ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా ప్రక్రియపై బీఎల్ఓలకు శిక్షణ

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 19 శంకర్‌పల్లి, చేవెళ్ల నియోజకవర్గం :** ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం చేపట్టాల్సిన కార్యక్రమాలపై బీఎల్ఓలు, బీఎల్ఓ పర్యవేక్షకులకు శంకర్‌పల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు ఆశీర్వాదం, అక్షయ్ కుమార్ ముసాయిదా జాబితా అనంతరం బీఎల్ఓలు చేపట్టాల్సిన ప్రక్రియలు, మార్గదర్శకాలు, నిబంధనలను వివరించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కచ్చితత్వం, పారదర్శకతతో సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ యోగేష్ కుమార్, నార్సింగి సర్కిల్ జీహెచ్ఎంసీ డీఈఈ, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణ రెడ్డి శిక్షణలో పాల్గొని బీఎల్ఓలు, పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్-2026 అనంతర ప్రక్రియలను నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పూర్తి చేసేందుకు నిబంధనలను పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు స్పష్టం చేశారు. శిక్షణలో బీఎల్ఓ పర్యవేక్షకులు స్వప్న, రమ్య, సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.




# సీపీఎస్ రద్దు..ఓపీఎస్ పునరుద్ధరణే లక్ష్యం

**●టీఎస్‌సీపీఎస్ ఉద్యోగుల సంఘం పాలకుర్తి మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**
**●అధ్యక్షుడిగా కూటికంటి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా బక్క మహేష్**



**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి రిపోర్టర్ రమేష్:** తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (టీఎస్‌సీపీఎస్) ఉద్యోగుల సంఘం పాలకుర్తి మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల భద్రత,హక్కుల సాధన, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా పి. శోభారాణి (గ్రేడ్-2 హెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్ పాలకుర్తి), డా. బి. ఉషారాణి (వైద్యాధికారి, పీహెచ్‌సీ పాలకుర్తి), అధ్యక్షుడిగా కూటికంటి శ్రీనివాస్ (పీఈటీ, జెడ్పీహెచ్ఎస్ తొర్రూరు), ప్రధాన కార్యదర్శిగా బక్క మహేష్ (పంచాయతీ కార్యదర్శి, తీగారం), కోశాధికారిగా మామిండ్ల సోమ్మల్లు (పీడీ, జెడ్పీహెచ్ఎస్ పాలకుర్తి), కన్వీనర్‌గా బలుగుల ఉపేందర్ (స్కూల్ అసిస్టెంట్-సోషల్, జెడ్పీహెచ్ఎస్ దర్దేపల్లి) ఎన్నికయ్యారు.

**సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి**

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని నూతన కార్యవర్గం డిమాండ్ చేసింది. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టే పోరాటాల్లో అందరూ ఐక్యంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం,సంక్షేమం కోసం నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేస్తుందని అధ్యక్షుడు కూటికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బక్క మహేష్ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 19 చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్, డీఎల్‌పీవో సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వారపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫామ్ పాండ్స్ నిర్మాణం, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, పెన్షన్ దరఖాస్తుల స్వీకరణపై సమీక్షించారు. జలసిరి పథకంలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా రెండు ఫామ్ పాండ్స్ నిర్మించాలని, కమ్యూనిటీ సోక్‌పిట్లు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీలో అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి పెన్షన్ దరఖాస్తులు స్వీకరించాలని, ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావులేకుండా అర్హులైన వారికి మాత్రమే పెన్షన్ అందేలా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డీఎల్‌పీవో సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీకి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, వచ్చే మూడు సంవత్సరాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు. సర్పంచ్‌లతో సంప్రదించి రాబోయే సంవత్సరంలో చేపట్టే పనుల వివరాలను ప్రణాళికలో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు, ఏపీవో నాగభూషణం, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**●ఆయుష్ కార్యాలయంలో సైబర్ అవగాహన కార్యక్రమం**




**సికింద్రాబాద్, ఆగస్టు 19: (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కెట్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో అధికారులు సూచించారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అడ్మిన్ ఎస్ఐ కె. మహేశ్వరి, సైబర్ వారియర్ తో పాటు సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ మోసాలు, సోషల్ మీడియా భద్రత, ఓటీపీ పాస్‌వర్డ్‌ల రక్షణ, డిజిటల్ గోప్యత, సురక్షిత ఇంటర్నెట్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని, సైబర్ నేరాల నివేదికను సంబంధిత సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు డయల్ చేయాలని తెలిపారు. సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని ఏర్పరచుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి




●ప్రతి రైతుకూ సకాలంలో రుణం అందాలి
●రుణంతో పాటు రైతు ఆదాయమూ పెరగాలి
●క్యూర్, ప్యూర్, రేర్ అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహాలు
●ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 19:** తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగం కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు,





బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం విజన్ డాక్యుమెంట్ కాదు.. తెలంగాణ ప్రజలతో మనకున్న అభివృద్ధి ఒప్పందం. 2047 నాటికి తెలంగాణను 3



ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే బ్యాంకింగ్ రంగం కూడా రూపాంతరం చెందాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను ఎంతవరకు సాధించాయన్నదే కాకుండా, ఇచ్చిన రుణాలతో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయనే అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎంత ప్రైవేట్ పెట్టుబడి సమీకరించబడింది అన్నదే బ్యాంకింగ్ పని తీరుకు నిజమైన కొలమానంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ, వ్యవసాయ రంగం పునాది అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు రుణాలు అవసరమయ్యే సమయంలోనే అందించాలని ఆయన చెప్పారు. అర్హత ఉన్న రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. రైతు రుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని అన్నారు. రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా, ఆ రుణాన్ని అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు. రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని అన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి 52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమే అయినప్పటికీ, రుణాలు సకాలంలో అందడం ముఖ్యమని ఆయన గుర్తుచేశారు. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా రంగం కీలకమని అన్నారు. రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో డబ్బు చేతికి అందడం వ్యాపారులకు ముఖ్యమని చెప్పారు. దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన, కొలవదగిన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు. క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ప్రైజెస్ కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. కింద మంజూరు చేసే రుణాలకు పూచీకత్తు నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క అన్నారు. క్యూర్లో AI, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్లు, నాలెడ్జ్ రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్ అవసరమని ఆయన తెలిపారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అవసరమన్నారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు అందించాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రంలో జనధన్ ఖాతాలు భారీగా ఉన్నప్పటికీ దాదాపు 19.13 లక్షల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉందన్న విషయాన్ని గుర్తు ఆయన గుర్తు చేశారు. కేవలం ఖాతాలు తెరవడమే కాకుండా వారిని పొదుపు, బీమా, రుణాల దిశగా ప్రోత్సహించడమే నిజమైన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో నిష్క్రియాత్మకంగా ఉన్న బిజినెస్ కరస్పాండెంట్లను వెంటనే క్రియాశీలకం చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం బ్యాంక్ లింకేజీలకే పరిమితం చేయకుండా మైక్రో ఎంటర్ప్రైజెస్గా తీర్చిదిద్దేలా 'ఎంటర్ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్ మెంట్లు సమయానికి అందేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇస్తూ, తెలంగాణ ప్రజల సమగ్ర వికాసానికి బ్యాంకింగ్ రంగం ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ 2047బ్యాంకింగ్ రోడ్మ్యాప్'ను రూపొందించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. వ్యవసాయ, ఉత్పాదకత ఆధారిత రుణాలు, ఎమ్మెస్ ఎం ఇలు-స్టార్టప్ ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి ఆధారిత రుణాలు, గ్రీన్-క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్, జిల్లాల మధ్య క్రెడిట్ వ్యత్యాసాల నివారణ, దీర్ఘకాలిక మౌలిక వసతుల ఫైనాన్స్, కొత్త పరిశ్రమలు-సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలకు ఇందులో స్పష్టమైన వార్షిక లక్ష్యాలు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య, నాబార్డ్ సీజీఎం చిన్మయ్ కుమార్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, డీఎఫ్ఎస్ డైరెక్టర్ మానస గంగోత్రి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో
# సైబర్ క్రైమ్ పై అవగాహన






**అచ్చంపేట:** భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్టు జలగం సురేందర్:లింగాల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ క్రైమ్ఫై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు మాట్లాడుతూ: మొబైల్ యాప్ పై, వివిధ లింకులు ఓపెన్ చేయవద్దని, ఇతర వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటిపి చెప్పరాదు, మైనర్ పిల్లలు బైక్ నడప రాదు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని. హెల్ప్ లైన్ 1930 మరియు డయల్ 100 తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,గత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోరాదు, అపరిచిత, వ్యక్తులతో సోషల్ మీడియాలో స్నేహం చేయరాదు. టీఎస్ బ్యాక్ డోర్ ద్వారా ఉద్యోగం అంటూ లేదా మరే ఇతర వెబ్ సైట్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్, ఇమెయిల్స్ నమ్మవద్దు,ఫేస్బుక్ ప్రొఫైల్ లాక్ చేసి ఉండాలి. పేటీఎం, బ్యాంక్ అకౌంట్ కేవైసి అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్ కాల్స్ లకు స్పందించవద్దు, బహుమతులు గెల్చుకున్నారని వచ్చే ఇమెయిల్స్, మెసేజ్లకు స్పదించవద్దు.

**మీరు ఆశపడితే - మోసపోతారు జాగ్రత్త!!**

తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు పీసీలు షేక్ కుద్దూస్, కార్తీక్, కనకయ్య పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కొండయ్య, ధరమ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల ఆగస్టు 25న ఫార్మసిస్ట్, అసిస్టెంట్
# పోస్టులకు జాబ్-మేళా

●100ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ.

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 19 :** ఉస్మానియాయూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడ్ ప్లస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 25 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయ్మెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. లిమెడ్ ప్లస్ గ్రూప్ లోని ఫార్మాసిస్టు అసిస్టెంట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫార్మసీ బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఏదేని డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో చీఫ్ రాము ఓయూఒక ప్రకటనలో తెలియజేసారు. ఫార్మసిస్ట్ నెలకు (25,000/-) అసిస్టెంట్ ఫార్మసిస్ట్ (16,000/-)వేలవరకు వేతనం మరిన్ని వివరాలకు . శ్రీ సాయి శైలేష్, హెచ్ ఆర్ (గ్రాష్ట్ర.చీశీ.9666662481) ను సంప్రదించాలని ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో,వద్ద నేరుగా ఆగస్టు 25,2026న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.


# వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు
## పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ నీటిపారుదల, సౌర విద్యుదీకరణకు ప్రాధాన్యత




●రైతులను విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ ఉత్పత్తిదారులుగా తీర్చిదిద్దాలి

**వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపి ఐఏఎస్**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 19 :** వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని, తద్వారా వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ నీటిపారుదల, వ్యవసాయ సౌర విద్యుదీకరణ వంటి చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపి ఐఏఎస్ పేర్కొన్నారు. హైదరాబాద్లో జరుగుతున్న ఇండియా ఎనర్జీ సమ్మిట్ & ఎక్స్పో-2026లో భాగంగా బుధవారం నిర్వహించిన గ్రామీణ భారతదేశానికి విద్యుత్ పునరుత్పాదక ఇంధనం, విశ్వసనీయ విద్యుత్ మరియు సమ్మిళిత అభివృద్ధి అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో డా. బి. గోపి ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు, పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ నీటిపారుదల, సౌర విద్యుదీకరణ తదితర అంశాలపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ పంటలకు నీటి అవసరం భిన్నంగా ఉంటుందని, తద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం కూడా పంటను బట్టి మారుతుందని తెలిపారు. అయితే ప్రస్తుతం అధికంగా ఒకే పంటను




సాగు చేసే ఒకే రకమైన పంట విధానం వైపు వ్యవసాయం సాగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పంటల వైవిధ్యీకరణను ప్రధాన ప్రాధాన్యతగా తీసుకుందని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ముఖ్యంగా ఆయిల్పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. తక్కువ నీటి అవసరమున్న, రైతులకు లాభదాయకమైన పంటలను ప్రోత్సహించడం ద్వారా నీటిపై, వ్యవసాయ విద్యుత్పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని వివరించారు.

**సాగు విస్తీర్ణంలో గణనీయమైన వృద్ధి**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 1.31 కోట్ల ఎకరాలు ఉండగా, ప్రస్తుతం అది సుమారు 2.2 కోట్ల ఎకరాలకు చేరుకుందని డా. గోపి తెలిపారు. అంటే గత దశాబ్ద కాలంలో సాగు విస్తీర్ణం సుమారు 70 శాతం పెరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా, 2014తో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం మూడు రెట్లకు పైగా పెరిగిందని తెలిపారు. సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులు, విద్యుత్ వినియోగంపై ఒత్తిడిని తగ్గించేందుకు పంటల వైవిధ్యీకరణకు మరింత ప్రాధాన్యత ఇస్తూ తదనుగుణంగా వ్యవసాయ శాఖ తక్కువ నీటితో పండే మినుము పెసర వంటి పప్పు జాతి పంటలతో పాటుగా కూరగాయ పంటలు ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించే విధంగా విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు

**సూక్ష్మ నీటిపారుదలతో నీరు, విద్యుత్ ఆదా**

రాష్ట్రంలో సూక్ష్మ నీటిపారుదల విధానాలను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని డా. గోపి తెలిపారు. ముఖ్యంగా ఉద్యాన పంటల్లో సూక్ష్మ నీటిపారుదల విధానాలను అమలు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు, నీటిని ఎత్తిపోసేందుకు అవసరమయ్యే విద్యుత్ వినియోగాన్ని కూడా తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు. క్షేత్రస్థాయిలో సూక్ష్మ నీటిపారుదల విధానాలకు రైతుల నుంచి మంచి డిమాండ్ ఉందని ఆయన పేర్కొన్నారు.

**రైతులు విద్యుత్ వినియోగదారుల నుంచి ఉత్పత్తిదారులుగా**

వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని తగ్గించే దిశగా వ్యవసాయ రంగంలో సౌర విద్యుదీకరణ ను విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని డా. గోపి అన్నారు. రైతులు కేవలం విద్యుత్ వినియోగదారులుగా కాకుండా, భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తిదారులుగా కూడా మారేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా అవసరమైన మూలధన పెట్టుబడికి సహకారం అందించడంతో పాటు, రైతులకు అనుకూలమైన విధానాలను రూపొందించి సమర్థవంతమైన వ్యవస్థను ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సూచించారు.

**రైతు ఉత్పత్తిదారుల సంస్థల భాగస్వామ్యంతో సౌర విద్యుదీకరణ**

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వంటి సంస్థలను సౌర విద్యుదీకరణ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ద్వారా రైతులే విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని అభివృద్ధి చేయవచ్చని డా. గోపి పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని ఫీడర్ స్థాయిలో విభజించి పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు ఇదే సరైన సమయమన్నారు. ప్రతి క్లస్టర్ స్థాయిలో స్వయం సమృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల భాగస్వామ్యంతో సౌర విద్యుదీకరణ, పంటల వైవిధ్యీకరణ, నీటి మరియు విద్యుత్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయవచ్చని తెలిపారు.


**సమన్వయంతో స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి**

పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ నీటిపారుదల, వ్యవసాయ సౌర విద్యుదీకరణ, రైతు ఉత్పత్తిదారుల సంస్థల భాగస్వామ్యం-ఈ నాలుగు అంశాలను సమన్వయంతో ముందుకు




తీసుకెళ్లడం ద్వారా వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని, విద్యుత్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కూడా కల్పించవచ్చని డా. బి. గోపి పేర్కొన్నారు.నీరు-విద్యుత్-వ్యవసాయ రంగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా వనరుల సమర్థ వినియోగంతో పాటు స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి,రైతుల ఆదాయ వృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించవచ్చని ఆయన తెలిపారు.

# కోదండ రామాలయంలో
# వైభవంగా శ్రీనివాస కళ్యాణం







● హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8 కోదండ రామాలయంలో వైభవంగా శ్రీనివాస కళ్యాణం
●స్వామి వారి కళ్యాణాన్ని తిలకించిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి
● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**ఉప్పల్,ఆగష్టు19(భవిష్యత్ ప్రజాపాలన):**శ్రీ వేంకటేశ్వర మహా మంత్ర పీఠం ఆధ్వర్యంలో హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లోని శ్రీ కోదండ రామచంద్ర స్వామి కళ్యాణ మండపంలో 108వ శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కోదండ రామాలయం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరై వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువా కప్పిసన్మానించారు. అనంతరం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని ఆద్యంతం తిలకించారు. కన్నుల పండువలా సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకకు మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, రొండ్ల దామోదర్ రెడ్డి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు గణేష్ నాయక్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళీ కృష్ణ ముదిరాజ్,కిషన్ నాయక్,మాలు నాయక్,గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి నిల్వ కోసం రైతులకు అవగాహన కార్యక్రమం



●ఫామ్ ఫాండ్లు నిర్మించుకోవాలని డిప్యూటీ కమిషనర్ పిలుపు

**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి రిపోర్టర్ రమేష్:** జనగామ జిల్లా పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో వ్యవసాయ చెరువులను డిప్యూటీ కమిషనర్ శైలేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం కోసం ప్రతి రైతు తమ పొలంలో ఫామ్ ఫాండ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఫామ్ ఫౌండ్ల వల్ల పంటలకు సరిపడా నీరు అందుబాటులో ఉంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ చెరువుల పూడికతీత, పటిష్టత పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామ్రేడ్ జీడి సత్యనారాయణ మృతుదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**జనగాం జిల్లా, భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి రిపోర్టర్ రమేష్:** పాలకుర్తి మండల కేంద్రంలో కామ్రేడ్ జీడి సత్యనారాయణ మరణించిన విషయం తెలుసుకొని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటు న్నాము,పాలకుర్తి గ్రామ పార్టీ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య గౌడ్,వార్డు సభ్యులు నెమరు గొమ్ముల శ్రీనివాసరావు, కమ్మగాని ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మరియు వీరమనేని యాకాంతరావు, మాజీ సర్పంచ్ గాదపాక భాస్కర్,ఎండి సలీం, పన్నీర్ వెంకన్న, ఆకుల నాగరాజు, మామిండ్ల యాకన్న, కమ్మగాని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జీడి మనోహర్‌కి పితృవియోగం





**జనగాం జిల్లా, భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి రిపోర్టర్ రమేష్:** జనగామ జిల్లా పాలకుర్తి జీడి మనోహర్,జీడి సోమయ్య జీడి శ్రీను తండ్రి సత్యనారాయణ అనారోగ్యంతో మరణించడం వలన మృతదేహానికి పూలమాలవేసి, కుటుంబ సభ్యులను పరామర్శించిన పాలకుర్తి బి ఆర్ ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్,పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ విజయ నాగన్న గౌడ్, వారి వెంట గాదెపాక కిరణ్ ఉప సర్పంచ్,వార్డ్ సభ్యులు, కత్తి దస్తగిరి, మామిళ్ళ కవిత శోభన్ బాబు,దాసరి అనూష మధు,కమ్మగాని సుధాకర్,కాటబత్తిని రమేష్, కోల నారాయణ.రేపాల అశోక్.గాదపాక శ్రీనివాస్, కమ్మగాని వెంకటేశ్వర్లు.రాజ్ మహమ్మద్.బాధిత కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


# కొత్తపేటలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అతవలె పార్టీ



●తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు స్నేహలత ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది.


**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాప్ రిపోర్టర్ ఆగస్టు 19 :** జిల్లా కమిటీల నిర్మాణం భవిష్యత్తు కార్యాచరణ పై జిల్లా కమిటీల నిర్మాణంపై ఈ మీటింగ్‌లో మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుంచు లింగయ్య, బరిగెల రాములు -రాష్ట్ర అధికార ప్రతినిధి మహంకాళి శ్రావణ్ కుమార్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు, గద్దల వెంకన్న, వంగాల సందీప్, కాసర్ల రాజకుమార్, ఏర్పుల ప్రశాంత్, ఏ సైదులు, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

# 22/ఎ సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం



●ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి
●ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
●అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం
●మాభూమి మాకు దక్కింది ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు -22 ఏ దరఖాస్తుదారులు

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాప్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 19 :** 22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి



త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**"నా భూమి నాకు దక్కిం ది.. -ప్రభుత్వానికి కృతజ్ఞతలు"**

22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన పోచారం గ్రామానికి చెందిన రాకేష్ తన అనుభవాన్ని వెల్లడించారు.

"నేను 2022లో పోచారం గ్రామంలో వంద గజాల స్థలం కొనుగోలు చేశాను. ఇటీవల ఆ స్థలాన్ని విక్రయించేందుకు నార్లపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. మొదట డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించగా, మీ భూమి22/ఎలో ఉందని చెప్పారు. దీంతో కొంత ఆందోళనకు గురయ్యాను. అయితే మూడు, నాలుగు రోజుల క్రితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి మీ భూమికి ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ఈ రోజు నేను ఆ స్థలాన్ని కొనుగోలుదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేశాను. నా భూమి నాకు దక్కేలా సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు" అని తెలిపారు.

**" క్లియరెన్స్ వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం"**

నారపల్లి సబ్ రిజిస్ట్రార్ సునీల్ మాట్లాడుతూ.. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 50ను ఏపీ హౌసింగ్ బోర్డు భూమిగా పేర్కొంటూ గత ఏడాది డిసెంబర్‌లో22/ఎ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల కలెక్టర్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. వెంటనే గతంలో రిజిస్ట్రేషన్ కోసం మమ్మల్ని సంప్రదించిన వారికి ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నాం. వారు కార్యాలయానికి వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం" అని సబ్ రిజిస్ట్రార్ సునీల్ తెలిపారు.

**మా సొసైటీలోని 300 ప్లాట్లకు పూర్తి విముక్తి కలిగింది- చక్రపాణి (కొనుగోలుదారు)**


కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని నెంబర్ 80సిలోగల 250 గజాల స్థలాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు చేశాను. అయితే రిజిస్ట్రేషన్ కోసం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఆభూమి 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ చేయలేదు. తాజాగా ప్రభుత్వ చర్యల కారణంగా నిన్ననే నాకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ఈ రోజు వెళ్లగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అంతేగాక మా సొసైటీలోని 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు చెప్పారు. మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు- అని చక్రపాణి అనే కొనుగోలుదారు తెలిపారు.

**ప్రభుత్వ సకాల చర్యల వల్ల రిజిస్ట్రేషన్ పూర్తయింది- రాజేంద్రప్రసాద్**

బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల రెయిన్‌బో




విస్టాలో ఉన్నప్లాట్ నెంబర్ 804 ను విక్రయించేందుకు కొద్దికాలం క్రితం యజమాని వెంకట విజయ్‌కుమార్ ప్రయత్నించారు. అయితే 22ఎ నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్ జరగలేదు. వెంకట విజయ్‌కుమార్ ఆస్ట్రేలియా వెళ్లిపోతూ తన మామ రాజేంద్రప్రసాద్‌కు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. ఈనెల 12న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో ఈరోజు రాజేంద్రప్రసాద్ వెళ్లి రిజిస్ట్రేషన్



కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ ఏమన్నారంటే...

మా అల్లుడు సేల్ చేద్దామనుకున్న ఫ్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వస్తే... 22ఎ కింద గవర్నమెంట్ నిషేధం విధించిందని చెప్పినందున ఆ రోజు రిజిస్ట్రేషన్ అవ్వలేదు. ఆ తర్వాత నా అల్లుడు నా పేరు మీద స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. అది ఇంకా చాలా కాలమే పడుతుందేమో అనుకున్నాం గానీ... అదృష్టవశాత్తూ ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకున్నందున వెంటనే ఒకవారం రోజుల్లోనే ఇది క్లియర్ అయ్యి... అనుకూలంగా తేలింది. ఈ రోజు రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం, రిజిస్ట్రేషన్ కూడా మాకు సంతృప్తి కరంగా పూర్తిగా అవుతుంది. ప్రభుత్వానికి చాలా కృతజ్ఞతలు. -

**ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి - శ్రీనివాస్**



బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల వైష్ణవి ఎస్టేట్ ప్రతినిధి శ్రీనివాస్ మూసాపేట సర్వే నెంబర్ 108లోగల భూమిని విక్రయించేందుకు రాగా 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తిరస్కరించారు. తాజాగా ప్రభుత్వ చర్యలు కారణంగా ఈరోజు శ్రీనివాస్ తన భూమికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాకు 2005 లో సీలింగ్ పర్మిషన్ వచ్చింది. మేము రిజిస్ట్రేషన్ కి అప్పటినుంచి ప్రయత్నం చేస్తున్నాము. . తాజాగా రెండు వారాల క్రితం మూసాపేట్ బాలానగర్ ఆఫీస్ లో రిజిస్ట్రేషన్ కి వెళ్తే 22ఎ లో పెట్టామని చెప్పారు. మేము కలెక్టర్ గారిని అప్రోచ్ అయ్యాము. ఆ తర్వాత ఈ రోజు మళ్ళీ అది క్లియర్ చేశారు. దాంతో ఈ రోజు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ కంప్లీట్ చేశాము. ప్లాట్ కూడా రిజిస్ట్రేషన్ అయింది. థాంక్యూ వెరీ మచ్.

**పలు సర్వే నెంబర్లలో నిషేధం తొలగింపు - ఎస్.ఆర్.వో**

బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గల సర్వే నెంబర్లు 101/1, 101/2, 102, 108, 109, 112, 81లో ఉన్న సుమారు 3000 చదరపు మీటర్ల స్థలంపై ఉన్న 22ఎ నిషేధం తొలగిపోయింది. ఈ సర్వే నెంబర్లలో ఉన్న భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుపుకోవచ్చునని బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

**అధికారుల ఆదేశాలతో వెంటనే రిజిస్ట్రేషన్**

మేము ఏజీ కాలనీ, గుండ్ల పోచంపల్లిలోని .గౌరీశంకర్ వద్ద మేము ఒక ప్లాట్ తీసుకోవడం జరిగింది. మేము జూలై ఆరు నాడు ఇక్కడ రిజిస్ట్రేషన్‌కి రాగా 22ఎ నిషేధిత జాబితా పేరిట రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. అప్పటినుంచి మేము కలెక్టర్ ఆఫీస్ కి, అక్కడ ఇక్కడ తిరుగుతుంటే... ఈరోజు డిప్యూటీ కలెక్టర్ వచ్చి, క్లియర్ చేయమని సబ్-రిజిస్ట్రార్ కి చెప్పారు. ఆ వెంటనే సబ్ రిజిస్ట్రార్ మేడమ్ గారు మాకు ఫోన్ చేసి, రిజిస్ట్రేషన్ పూర్తి చేసి మాకు ఈ డాక్యుమెంట్స్ ఇవ్వడం జరిగింది అని ఒక దరఖాస్తుదారు తెలిపారు.


# ఓటర్ల జాబితా సవరణలపై బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ






**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 19 శంకర్‌పల్లి, చేవెళ్ల నియోజకవర్గం :** ముసాయిదా ఓటర్ల జాబితా అనంతర కార్యక్రమాలపై బీఎల్ఓలు, బీఎల్ఓపర్యవేక్షకులకు నార్సింగిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు ఆశీర్వాదం, అక్షయ్ కుమార్ ముసాయిదా జాబితా అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియలు, నిబంధనలు, మార్గదర్శకాలను వివరించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కచ్చితత్వం, పారదర్శకతతో జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ యోగేష్ కుమార్, నార్సింగి సర్కిల్ జీహెచ్ఎంసీ డీఈఈ, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణ రెడ్డి శిక్షణలో పాల్గొని బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా తయారీలో నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా కార్యక్రమాలను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు బీఎల్ఓలు, పర్యవేక్షకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీఎల్ఓ పర్యవేక్షకులు స్వప్న, రమ్య, సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

# కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఆత్మహత్య



**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 19 చేవెళ్ల నియోజకవర్గం :** మద్దూర్ గ్రామ పరిధిలోని శాంతివనం బీటీ రోడ్డుపక్కన ఓమహిళ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. 18.08.2026న సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు పాత్లావత్ లక్ష్మి (35), మాదనపల్లి తండా, శంషాబాద్ మండలానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఆమెకు గతంలో వివాహం కాగా ఒక కుమారుడు ఉన్నాడు. భర్తతో తరచూ గొడవలు జరగడంతో సుమారు నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం పాత్య రమేష్‌ను వివాహం చేసుకుని రామంజాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. 18.08.2026 మధ్యాహ్నం విధులకు సంబంధించిన విషయమై లక్ష్మి, రమేష్ మధ్య గొడవ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం లక్ష్మి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై 19.08.2026న ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రామంతాపూర్ డివిజన్ సమస్యపై జోనల్ కమీషనర్ రాధికా గుప్తా ని కలిసిన

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి**
**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు**



**ఉప్పల్,ఆగష్టు19(భవష్యత్ ప్రజాపాలన):** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ ఏడీఆర్ఎం హాస్పిటల్ గల్లీ లో కొత్తగా బీటీ రోడ్ వేసి దాదాపుగా 6నెలలు అవుతున్న, రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్స్, రోడ్డుకి సమానముగా లేకపోవటం వలన గుంతలుగా ఏర్పడి చాల ప్రమాదాలు జరిగాయి, వాహనదారులు ఇబ్బందికి గురిఅవుతున్నారు అని, ఇట్టి సమస్యపై జోనల్ కమీషనర్ రాధికా గుప్తా దృష్టికి ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు జోనల్ కమీషనర్ సానుకూలంగా స్పందించి, సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంథం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# తీజ్ పండుగలో పాల్గొన్న మన్నె గోవర్ధన్ రెడ్డి




**హైదరాబాద్:** బంజారా సమాజానికి ఎంతో ప్రత్యేకమైన తీజ్ పండుగ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. చింతల్‌బస్తీలోని సైఫాబాద్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన హాజరై బంజారా మహిళలు, యువతులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తీజ్ పండుగ బంజారా సమాజ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా యువతులు తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి పండుగలు దోహదపడతాయని పేర్కొన్నారు. మన సంస్కృతే మన గుర్తింపు అని, ఆధునిక కాలంలో ఎంత అభివృద్ధి సాధించినా మన మూలాలను, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. తీజ్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి, సుఖసంతోషాలు, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ బంజారా సమాజ ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కరుణాసాగర్, ప్రొఫెసర్లు డాక్టర్ నరేందర్ పవార్, నవీన్ నాయక్, డాక్టర్ నరేష్, డాక్టర్ చంద్రశేఖర్ శంకర్, రామయ్య, జగన్, సుమంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.



# 27 నుంచి ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

- **యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం**
- **20 వ తేదీ సాయంత్రం నుంచి ఆన్ లైన్ లో అర్హుల జాబితా**
- **23 వరకు అభ్యంతరాల స్వీకరణ**




**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాప్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 19:** అవుటర్ రింగ్ రోడ్ క్యూర్ పరిధిలో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియను ఈ నెల 27 వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి గౌతం తెలిపారు. ప్రతి రోజు నాలుగు నియోజకవర్గాల చొప్పున వరుసగా నాలుగు రోజుల పాటు 30 వ తేదీ వరకు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామని వివరించారు. క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మించాలన్న లక్ష్యంలో భాగంగా, పైలట్ ప్రాజెక్టు కింద 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే పేరుతో హౌసింగ్ బోర్డు దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. గడవు ముగిసే సమయానికి మీసేవా కేంద్రాలతోపాటు, ఆన్ లైన్ లోనూ, వాట్సాప్ మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నదన్నారు. దరఖాస్తు దారులు హైదరాబాద్‌లో స్థిర నివాసముంటున్నారా లేదా, ఓఆర్ ఆర్ లోపల వారికి ప్లాట్, ఫ్లాట్ వంటివి ఉన్నాయా, మొదలైన వివరాలను పరిశీలించి తుది జాబితాను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారుల వివరాలను గురువారం సాయంత్రం నుంచి https://ts.meeseva.telangana.gov.in/, tghb.cgg.gov.in, tghb.telangana.gov.in ద్వారా ఆన్ లైన్‌లో అందుబాటులో ఉంచనున్నామని పేర్కొన్నారు. ఈ జాబితాలోని వివరాలపై ఏమైనా అభ్యంతరాలుంటే 23 వ తేదీ సాయంత్రం వరకు తెలియచేయవచ్చన్నారు. వచ్చిన అభ్యంతరాలన్నిటిని పరిశీలించిన అనంతరం ఇండ్లకోసం అర్హులైన దరఖాస్తు దారుల వివరాలతో తుది జాబితాను ఈ నెల 25 వ తేదీన ప్రకటిస్తామని ఆయన వివరించారు.

**27 నుంచి లాటరీ ప్రక్రియ**

అర్హులైన దరఖాస్తుదారుల జాబితా రూపొందించిన తరువాత ఈ నెల 27 నుంచి లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వివరించారు. ప్రతి రోజూ నాలుగు నియోజకవర్గాలు చొప్పున నాలుగు రోజుల పాటు వరుసగా లాటరీ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ వి.పి గౌతం పేర్కొన్నారు. రెవెన్యూ, హౌసింగ్ బోర్డు అధికారులు, మీడియా సమక్షంలో ఈ లాటరీ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. ఈ లాటరీ ప్రక్రియను యూట్యూబ్, తదితర మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. ముందు ప్రకటించినట్లుగా ఎస్సీ, ఎస్టీ, బిసి, దివ్యాంగులు, తదితర రిజర్వేషన్ల ప్రకారం డ్రా తీస్తామని పేర్కొన్నారు. ప్రతి కేటగిరిలోనూ 20 శాతం వెయిటింగ్ లిస్టు కూడా రూపొందిస్తామని వీరిని కూడా లాటరీ డ్రా ద్వారానే ఎంపికి చేస్తామని పేర్కొన్నారు. ఇండ్ల కేటాయింపు విషయంలో ఎటువంటి సందేహాలు, అపోహలకు లోనుకావద్దనీ, పూర్తి పారదర్శకంగానే అర్హుల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశంలో ఏమైనా సందేహాలుంటే కాల్ సెంటర్ నెంబరు 040 24603572 లో సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

# కార్డియో చేస్తున్నప్పటికీ బరువు తగ్గడం లేదా.. అయితే అందుకు కారణాలు ఇవే..



బరువు తగ్గేందుకు కార్డియో వ్యాయామాలు మంచి మార్గంగా వైద్య నిపుణులు చెబుతుంటారు. నడక, పరుగు, సైక్లింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలు గుండె వేగాన్ని పెంచడంతో పాటు శరీరం ఎక్కువ కేలరీలను ఖర్చు చేసేలా చేస్తాయి.శరీరంలో నిల్వ ఉన్న శక్తిని వినియోగించడం ద్వారా బరువు తగ్గించే ప్రక్రియకు ఇవి సహాయపడతాయి. అయితే ప్రతిరోజూ కార్డియో చేస్తున్నంత మాత్రాన బరువు తప్పకుండా తగ్గుతుందని చెప్పలేం.ఆహారం, మెటబాలిజం,కండరాల పరిమాణం,ఒత్తిడి, రోజువారీ కదలికలువంటి అంశాలు కూడా బరువు నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయి. కార్డియో వ్యాయామాల సమయంలో శరీరం ఎక్కువశక్తిని ఖర్చు చేస్తుంది.అయితే వ్యాయామం పూర్తయిన తర్వాత ఆ అదనపు కేలరీల ఖర్చు అదే స్థాయిలో కొనసాగదు.అందువల్ల కార్డియోపై మాత్రమే ఆధారపడ కుండా ఆహారం, శక్తి వినియోగం, కండరాల ఆరోగ్యం వంటి అంశాలను సమతుల్యం చేసుకోవాలి.

**అధికంగా తినడం..**

ప్రతిరోజూ కార్డియో చేస్తున్నప్పటికీ బరువు తగ్గకపోవడానికి ఒక కారణం వ్యాయామం తర్వాత ఎక్కువగా తినడమే. కార్డియో చేసిన తర్వాత ఆకలి పెరగడం సాధారణం. ఈ సమయంలో అవసరానికి మించి కేలరీలు తీసుకుంటే వ్యాయామం ద్వారా ఖర్చైన కేలరీలను తిరిగి భర్తీ చేసే అవకాశం ఉంటుంది. ఫలితంగా బరువు తగ్గడానికి అవసరమైన కేలరీ లోటు ఏర్పడదు. మరో కారణం మెటబాలిక్ అడాప్టేషన్. శరీరం ఒకే రకమైన వ్యాయామానికి అలవాటు పడినప్పుడు అదే వ్యాయామాన్ని గతంలో కంటే మరింత సమర్థవంతంగా చేయడం ప్రారంభించవచ్చు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు సొంతింటి కల



- **నెల్లుట్లలో గృహప్రవేశానికి హాజరైన గుడి వంశీధర్‌రెడ్డి**



**జనగామ జిల్లా , ఆగస్టు 19 (భవిషత్ ప్రజాపాలన ):** లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన దామెర నవీన్ ఇంటి గృహప్రవేశానికి హాజరై రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అతి తక్కువ వ్యయంతో పూర్తి స్థాయి సిమెంట్ నిర్మాణంతో ఇంటిని నిర్మించుకున్న నవీన్‌ను అభినందించారు. పేదలకు ఆర్థిక భారం లేకుండా ఇలాంటి ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. రెండో విడతలో ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముందుచూపుతో దేవాదుల ద్వారా గోదావరి జలాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ నెల చివరి వారం వరకు సాగునీరు అందనున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచి నర్సింగ రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామం అభివృద్ధి పథంలో సాగుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని కుల సంఘాల భవనాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని వంశీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని అశోక్‌కుమార్, ఉపసర్పంచి దామెర కావ్య ప్రభాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింగ రమేష్, జెగ్గం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# సంస్థ బలోపేతానికి బంజారా సేవాదళ్‌కు భారీ విరాళాలు

- **రూ.1.44 లక్షల ఆర్థిక సహకారం.. సమాజ అభ్యున్నతికి దాతల చేయూత**



**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** బంజారా సమాజ అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, సంస్థాగత బలోపేతం, మైదాన ప్రాంత గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బంజారా సేవాదళ్‌కు పలువురు నాయకులు అండగా నిలిచారు. సంస్థ భవిష్యత్ కార్యక్రమాలకు తమ వంతు సహకారంగా మొత్తం రూ. 1,44,000 విరాళాన్ని అందించారు. సంస్థ అభివృద్ధి కోసం రామావత్ రామ్‌చందర్ నాయక్, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్, రూ. 1,11,000 విరాళంగా అందించారు. అలాగే బంజారా సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు నేనావత్ అజయ్ నాయక్ రూ. 11,000, కత్రావత్ హన్మంతు నాయక్ బంజారా సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్ రూ. 22,000 ఆర్థిక సహకారం అందించారు.

**సమాజం కోసం మరింత బలమైన కార్యాచరణ**

బంజారా సమాజంలో ఐక్యత, చైతన్యం పెంపొందించడంతో పాటు విద్య, ఉపాధి, సంక్షేమం, హక్కులు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై బంజారా సేవాదళ్ నిరంతరం పనిచేస్తోందని ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా మైదాన ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరంగా పోరాటాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'సంస్థ బలం కార్యాలయాల్లో కాదు.. సమాజం కోసం నిలబడే ప్రతి మనిషి నమ్మకంలో ఉంటుంది. దాతలు అందించిన ప్రతి రూపాయి బంజారా సమాజ భవిష్యత్తుకు ఒక బలమైన అడుగు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ హక్కుల సాధన కోసం మరింత శక్తివంతంగా ముందుకు సాగుతాం" అని బంజారా సేవాదళ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

**రాష్ట్ర కమిటీ నాయకుల హాజరు**

ఈ కార్యక్రమంలో బంజారా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు రఘురామ్ రాథోడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ నాయక్, పాపయ్య నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజ్ కుమార్ నాయక్ తదితర రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

**దాతలకు కృతజ్ఞతలు**

బంజారా సేవాదళ్ సంస్థ అభివృద్ధికి విలువైన ఆర్థిక సహకారం అందించిన రామావత్ రామ్‌చందర్ నాయక్, నేనావత్ అజయ్ నాయక్, కత్రావత్ హన్మంతు నాయక్లకు రాష్ట్ర కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."సమాజం కోసం చేసే సేవకు విరాళం కేవలం ఆర్థిక సహాయం కాదు.. అది భవిష్యత్ తరాల కోసం వేసే అభివృద్ధి విత్తనం" అని సురేష్ నాయక్ ఇస్లావత్, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, బంజారా సేవాదళ్ పేర్కొన్నారు.

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారి హుండీ ఆదాయం రూ.62.48 లక్షలు

- **ఆషాఢ జాతర-2026 సందర్భంగా భక్తుల కానుకల వెల్లువ**



**సికింద్రాబాద్, ఆగస్టు 19 (భవిష్యత్ ప్రజా పాలన న్యూస్):** సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహకాళి దేవస్థానంలో ఆషాఢ జాతర-2026 సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి. మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు హుండీలను విప్పి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, చైర్మన్ సురిటి కామేశ్వర్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది తో పాటు భక్తుల సమక్షంలో లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. హుండీల ద్వారా అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల్లో నోట్ల రూపంలో రూ. 58,90,416, నాణేల రూపంలో రూ. 3,57,751 లభించాయి. మొత్తంగా రూ. 62,48,167 నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా హుండీలలో 49 గ్రాముల మిశ్రమ బంగారం, 980.500 గ్రాముల మిశ్రమ వెండి కూడా లభించినట్లు వెల్లడించారు. ఆషాఢ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పెద్దఎత్తున కానుకలు సమర్పించడంతో ఈ స్థాయిలో హుండీ ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. హుండీ లెక్కింపు ప్రక్రియను అధికారులు, దేవాదాయ శాఖ ప్రతినిధులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు.



Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపల్ హత్య కేసులో బిగ్‌ట్విస్ట్‌హత్య చేసింది పదో తరగతి విద్యార్థులే



**నల్గొండ జిల్లా:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీకి చెందిన నాగార్జున పబ్లిక్? స్కూల్? ప్రిన్సిపల్? కె.రూపారెడ్డి, ఈ నెల 11న దారుణ హత్యకు గురయ్యారు. ఇద్దరు పదో తరగతి విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. సుమారు 80 మందిని విచారించిన అనంతరం, కొండమల్లేపల్లి మండలంలోని రెండు తండాలకు చెందిన విద్యార్థులు ఈ ఘాతుకానికి పాల్పడారని పోలీసులు గుర్తించారు.ఆ రాత్రి ఏం జరిగిందంటే? : పదో తరగతి విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఇద్దరు పదో తరగతి విద్యార్థులు హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. మాస్క్?, హుడీ ధరించి ఈనెల 11న రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి రూపారెడ్డిని డబ్బులు ఇవ్వాలని బెదిరించగా ఆమె ప్రతిఘటించారు. ఈ క్రమంలో మాస్క్? ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి రూపారెడ్డి కేకలు పెట్టారు. దీంతో గుర్తింపు బయటపడటంతో రూపారెడ్డిని వెంట తీసుకెళ్లి కత్తితో పొడిచారు. ఇంట్లో రూ.2.20 లక్షల తీసుకుని బయట ఉన్న విద్యార్థికి రూ.40 వేలు ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. అయితే ఇద్దరు విద్యార్థులు దొంగతనాలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో అనుమానంతో పదోతరగతి విద్యార్థిని విచారిస్తున్న సమయంలో జేబులో రూ.1.60 లక్షల నగదు గుర్తించారు. దానిపై రక్తపు మరకలు ఉండటాన్ని చూసి ప్రశ్నించడంతో విద్యార్థులు నిజాన్ని ఒప్పుకున్నారు.పూర్తి వివరాలు ఇలా : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో రూపారెడ్డి స్థానికంగా ఓ ప్రైవేట్? పాఠశాలలో ప్రిన్సిపల్?గా విధులు నిర్వర్తించేవారు. భర్త రాజేందర్? రెడ్డితో కలిసి జేబీ కాలనీలో నివాసం ఉండేవారు. అయితే రూపారెడ్డికి కుటుంబానికి హైదరాబాద్‌లో సొంత ఇల్లు ఉంది. కుమారుడు అభినవ్ రెడ్డి హైదరాబాద్‌లో ఇంజినీరింగ్‌చదువు తున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు తరచూ హైదరాబాద్?కు వెళ్తుంటారు.గత శనివారం నుంచి వరుసగా మూడు


రోజులు సెలవులు ఉండటంతో రూపారెడ్డి భర్తతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. భర్తకు అక్కడ పని ఉండటంతో ఆమె ఆగస్టు 11న ఉదయం ఒక్కరే కొండమల్లేపల్లికి తిరిగి వచ్చారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విధులకు హాజరయ్యారు. సాధారణంగా సాయంత్రం 6.30 గంటల వరకు పాఠశాలలోనే ఉండేవారని తెలుస్తోంది. ఆగస్టు 11వ తేదీన తమ ఇంటికి స్నేహితులు వస్తున్నారని చెప్పి, సాయంత్రం 5.25 గంటల సమయంలోనే పాఠశాలకు సమీపంలోని తన ఇంటికి వెళ్లారు.పలుమార్లు కాల్? చేసినా స్పందన లేదు : ఆ తర్వాత ఆమె నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందలేదు. రాత్రి సమయంలో కూడా ఆమె ఫోన్?కు పలుమార్లు ఫోన్? చేసినా స్పందించలేదు. ఆగస్టు 12న భర్త రాజేందర్?రెడ్డి రూపారెడ్డికి ఫోన్? చేయగా స్విచ్ఛాఫ్? వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన ఆయన తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి కాల్? చేసి ఇంట్లోకి వెళ్లి చూడాలని కోరారు. వారు ఇంటికి వెళ్లి ఎంత పిలిచినా లోపల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో విషయాన్ని రాజేందర్?రెడ్డికి తెలియజేశారు. ఈ నేపథ్యంలో తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న చింతపల్లి ఎస్సై రాంమూర్తికి ఫోన్? చేసి పరిస్థితిని వివరించారు. ఎస్సై స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి పరిశీలించగా రూపారెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ఆమె భర్తకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## సీఎం విలాసాలకు వందల కోట్లు.. ప్రభుత్వానికి పట్టని ప్రజల పాట్లు



**భీమ్‌గల్ / బాల్కొండ నియోజకవర్గం :** విలాసాలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ (జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ పట్టణ అభివృద్ధి పై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌కు ఇప్పటికే ఒక హెలికాప్టర్ ఉండగా నెలకు రూ. 5 కోట్లకు పైగా అద్దెతో ఏకంగా రూ.111 కోట్లు వెచ్చించి అదనపు హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకోవడం ఏ రకమైన పొదుపు అని ప్రశ్నించారు.మనుమడి కోసం రూ.10 కోట్లతో ఫుట్ బాల్ కోర్టులు, మెస్సీ పర్యటనల పేరిట ప్రచార ఆర్భాటాలకు వందల కోట్లు, అందాల పోటీలకు 100 కోట్లు,శంషాబాద్ కనెక్టివిటీ ఉన్నప్పటికీ సొంత భూముల ధర పెరగడం కోసం కొడంగల్ నుండి శంషాబాద్ వరకు రూ.3,500 కోట్లతో 6 వరుసల రహదారిని చేపట్టడానికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ ( ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి అభివృద్ధి ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని . గత కాంగ్రెస్ పాలనలో మూతపడ్డ వ్యవస్థలను తాము అధికారంలోకి వచ్చాక పునరుద్ధరిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తూ, బిల్లులు నిలిపివేసి భీమ్‌గల్ అభివృద్ధిని తిరోగమనం వైపు నడిపిస్తున్నారని మండిపడ్డారు.

## తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై కీలక జీవో.. 5 షోలకు ప్రభుత్వం అనుమతి




**హైదరాబాద్ :** తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2ఖ/4ఖ స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది.చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హైబడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరా ళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

# ఓట్లు రద్దయినా నో టెన్షన్ రాజధానిలోని మూడు జిల్లాల్లో ఇదే పరిస్థితి

**హైదరాబాద్ :** క్యూర్ (హైదరాబాద్) పరిధిలోని మూడు జిల్లాల్లో దాదాపు సగం ఓట్లు రద్దయినా, నగరవాసుల్లో ఎలాంటి ఆందోళన కనిపించడం లేదు. కిందిస్థాయిలోని నేతలూ ఈ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. సమీప భవిష్యత్తులో హైదరాబాద్?లో ఎన్నికలు లేకపోవడమే అందుకు కారణం. సర్వేలో రద్దయిన ఓట్లను మళ్లీ నమోదు చేయించవచ్చనేదే వారి ప్రధాన ధీమా. మరోవైపు ముసాయిదా జాబితాలోని 71 లక్షల ఓటర్లలో 38 లక్షల మంది మ్యాపింగ్ కాని, వివరాలు సరిగాలేని ఓటర్లకు నోటీసులు ఇవ్వడంపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. సోమవారమే ప్రక్రియ మొదలవ్వాల్సి ఉండగా, నోటీసు ముద్రణలో జాప్యం జరిగిందని, బుధవారం నుంచి నోటీసులు పంపిణీ చేస్తామని అధికారులు వెల్లడించారు.50 శాతం చేరువకు : సనత్‌నగర్, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, తదితర నియోజకవర్గాల్లో ఇప్పటికే 45 శాతం ఓట్లు గల్లంతవగా, నోటీసులకు సరైన సమాధానాలు అందకపోతే మరో 5 శాతం ఓట్లు రద్దవుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తంగా అక్టోబరు 19న తుది ఓటరు



జాబితా విడుదలయ్యే నాటికి రద్దయిన ఓట్ల శాతం 37.3 శాతం నుంచి 50 శాతానికి చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా : అక్టోబరు 19న తుది ఓటరు జాబితా విడుదలవనుంది. ఆ మరుసటి రోజు నుంచే కొత్తగా ఓటరు నమోదు (ఫారం-6), ఓటు రద్దు (ఫారం-7), ఓటరు కార్డులో సవరణ (ఫారం-8) అప్లికేషన్ల పరిశీలన మొదలవుతుందని, దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నగరవాసులను విజ్ఞప్తి చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలోనే వివిధ రాజకీయ పార్టీలు కాలనీల్లో ఓటరు నమోదు ప్రక్రి యను చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. నవంబ రులో జీ హెచ్ఎంసీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆయా పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు. ఇప్పటి నుంచే కొత్త ఓటర్ల నమోదు చేయించాలని దాదాపు అన్ని పార్టీలు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాయి.కొత్తగా ఓటరు నమోదుకూ సర్-2002 వివరాలు ! : కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకున్నా, బీఎల్‌వోలు అందించిన ఎన్యూమరేషన్ పత్రం తిరిగి ఇవ్వకున్నా, పొరపాటున ఏఎస్‌డీడీ (అనామలీస్) జాబితాలో పేరు వచ్చినా, ఫారం-6 ద్వారా ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల అధికారులు అవకాశం ఇచ్చారు. ఇందుకోసం వ్యక్తిగత వివరాలతో పాటు పుట్టిన తేదీ, ఇంటి చిరునామాను ధ్రువీకరించే అధికారిక పత్రాలు అందించాలి. అంతేకాకుండా సర్-2002 జాబితాలో పేరు ఉంటే ఆ వివరాలు తప్పకుండా నమోదు చేయాలి. లేకపోతే తండ్రి, తల్లి, తాత, నాయనమ్మల్లో ఎవరిదో ఒకరిది ఎస్?ఐఆర్-2002 వివరాలను నమోదు చేయాలి.అంటే కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలన్నా, గత సర్ వివరాలను తప్పక డిక్లరేషన్ పత్రంలో నమోదు చేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీలు ఈ విధానాన్ని తీవ్రంగా తప్పు పడుతున్నాయి. చాలా మంది ఓటర్లు ఆ వివరాలు లేకపోవడంతోనే ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకున్నా వివరాలు నింపి ఇవ్వలేదని, తర్వాత కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చని భావించారు. మరి ఇప్పుడు ఆ వివరాలను వారు ఎలా సమర్పిస్తారని రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసిన తర్వాతే ఓటు హక్కు కల్పించే పరిస్థితుల్లో సర్-2002 వివరాలు ఇవ్వాలన్న నిబంధనను వెనక్కి తీసుకోవాలని పార్టీలు కోరుతున్నాయి.

# మాజీమంత్రులు హరీశ్‌రావు, తలసాని హౌస్ అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 19 :**
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు సంబంధించిన కోకాపేట్‌లోని నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు సంబంధించి హరీశ్‌రావు పిలుపునివ్వడంతో పరిస్థితిని పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కోకాపేట్‌లోని ఆయన నివాసం వద్దకు పోలీసులు చేరుకోవడంతో రాజకీయ వర్గాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ వార్తతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హౌస్ అరెస్ట్..మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ





ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ

## సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాదు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నడుపుతున్నడు :

**హైదరాబాద్ :**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడపడం లేదని, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీనీ నడుపుతున్నాడని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి విమర్శించారు. ఈ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన సోదరులు అనుముల తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి, జగదీష్ రెడ్డి, కృష్ణా రెడ్డి, భూపాల్ రెడ్డి డైరెక్టర్‌లు ఉన్నారని



అన్నారు.ఈ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్ నగరంతోపాటు, రంగారెడ్డి జిల్లాలోని భూములను ఆక్రమించుకుంటోదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. వాళ్లు తలుచుకుంటే ఏ భూమినైనా తమ సొంతం చేసుకుంటున్నారని విమర్శించారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడుతూ సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత ముఖ్యమంత్రికి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## పోచారం శ్రీనివాసరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్

**నిజామాబాద్ :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎమ్మెల్యే , మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి పై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ పీఏసీ సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు సమావేశ మందిర గేటు వద్ద శాంతియుత నిరసన చేపట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను పోచారం శ్రీనివాసరెడ్డి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోచారం వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగేలా ఉన్నాయని నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ బీఫాంతో ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిపై పలు వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో



పనులు కావడం లేదని, నిధులు విడుదల చేయడం లేదని పోచారం వాపోయారు.మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి అడ్డంకులు సృష్టిస్తున్నారని పోచారం చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో దుమారా లేపాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కోట్లాది రూపాయాలతో నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, అయితే కాంగ్రెస్‌లోకి వస్తే మరింత అభివృద్ధి చేయవచ్చనే ఆశ నీరుగారిందని ఆరోపించారు.

# కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే.. మారిన బస్సు రూట్లు

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అమలు చేస్తున్న వన్-వే నిబంధనలతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్సు రూట్లలో మార్పులు చేస్తూ, స్టాప్‌లు, స్టేజీల వివరాలను అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మారిన బస్సు రూట్లు, స్టాప్‌ల ఆధారంగా ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు నడిపించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.బస్సు నంబరు 47 ఎల్ రాకపోకలుసికింద్రాబాద్ నుంచి మణికొండ : సికింద్రాబాద్- బేగంపేట- నాగార్జున సర్కిల్ - ఎల్వీ ప్రసాద్- బసవతారకం హాస్పిటల్- బీఆర్ఎస్ భవన్- ఎమ్మెల్యే కాలనీ- ఒమేగా- అపోలో ఆస్పత్రి- ఫిల్మ్‌నగర్- దర్గా- మణికొండమణికొండ నుంచి సికింద్రాబాద్: మణికొండ- పంచవటికాలనీ, దర్గా- ఫిల్మ్‌నగర్ - జర్నలిస్ట్ కాలనీ- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- అన్నపూర్ణ స్టూడియో- ఎల్వీ ప్రసాద్




హాస్పిటల్- టీవీ9 (మసీద్)- పంజాగుట్ట పీఎస్- ఆర్‌జే కాలేజీ- పోలీస్ లైన్- ప్లాజా- సికింద్రాబాద్.బస్సు నంబరు 222 కోఠి నుంచి పటాన్‌చెరు: కోఠి- లక్డీకాపూల్- మాసబ్‌ట్యాంక్- నాగార్జున సర్కిల్- ఎల్వీ ప్రసాద్- బసవతారకం హాస్పిటల్- బీఆర్ఎస్ భవన్- ఎమ్మెల్యే కాలనీ- ఒమేగా- అపోలో ఆస్పత్రి- జర్నలిస్ట్ కాలనీ- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- పెద్దమ్మగుడి - మాదాపూర్ పీఎస్- పటాన్ చెరు.పటాన్‌చెరు నుంచి కోఠి: పటాన్‌చెరు- మాదాపూర్ పీఎస్- పెద్దమ్మగుడి- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- అన్నపూర్ణ స్టూడియో- ఎల్వీ ప్రసాద్- నాగార్జున సర్కిల్- మాసబ్‌ట్యాంక్ - లక్డీకాపూల్- కోఠికోఠి నుంచి కొండాపూర్ : కోఠి- లక్డీకాకపూల్ - మాసబ్‌ట్యాంక్- పెన్షన్ ఆఫీస్ - ఎమ్మెల్యే కాలనీ- అపోలో ఆస్పత్రి- రోడ్డు నంబర్ 45 - మాదాపూర్ పీఎస్- కొండాపూర్.కొండాపూర్ నుంచి కోఠి : కొండాపూర్- మాదాపూర్ పీఎస్- రోడ్డు నంబరు 45- జర్నలిస్ట్ కాలనీ- జూబ్లీహి ల్స్ చెక్‌పోస్ట్- అన్నపూర్ణ స్టూడియో - ఎల్వీ ప్రసాద్- బసవతారకం హాస్పిటల్ - బీఆర్ఎస్ భవన్- ఎమ్మెల్యే కాలనీ - పెన్షన్ ఆఫీస్- మాసబ్‌ట్యాంక్ - కోఠి.బస్సు నంబరు 10 హెచ్‌సికింద్రాబాద్ నుంచి కొండాపూర్ :సికింద్రాబాద్- బేగంపేట- మైత్రివనం- యూసుఫ్ గూడ ఎక్స్‌రోడ్- వెంకటగిరి- నవయుగా - పెద్దమ్మగుడి- మాదాపూర్ పోలీస్ స్టేషన్ - కొండాపూర్.కొండాపూర్ నుంచి సికింద్రాబాద్: కొండాపూర్- పెద్దమ్మగుడి- జూబ్లీచెక్ పోస్టు- వెంకటగిరి - యూసుఫ్ గూడ- మైత్రివనం-బేగంపేట- సికింద్రాబాద్.

# సీఎం చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారు



**అమరావతి, ఆగస్టు19:** ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని వెలుగొండ ప్రా జెక్ట్ నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయాన్ని తాము మర్చిపోలేమన్నారు. తమ 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు జీవిత ంలో పూర్తవుతుందని తాము అనుకోలేదని అన్నారు. చూడలేం అనుకున్న ప్రాజెక్టును చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని నిర్వాసితులు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సీఎం చంద్రబాబు నాయుడు చెక్కులు అందజేశారు. బుధవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో సీఎంను ప్రాజెక్టు నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా వారికి రూ.200 కోట్ల మేర పరిహారం చెక్కులు అందించారు. అనంతరం నిర్వాసితులుపై విధంగా స్పందించారు.ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితులు ముఖ్యం: మంత్రి నిమ్మలవెలుగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పూర్తి కాని వెలుగొండ ప్రాజెక్టు పూర్తయినట్లు వైఎస్ జగన్ జాతికి అంకితం చేయటం ప్రపంచంలో 8వ వింత అని అభివర్ణించారు. నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం చెల్లింపులో నాడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పైసా కూడా చెల్లించలేదని ఆయన గుర్తు చేశారు.వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయటం ఎంత ముఖ్యమో.. నిర్వాసితులు కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నిర్వాసితుల కోసం నిర్మించిన 7 కాలనీల్లో నాలుగింటిలో 100 శాతం మౌలిక వసతులు వివరించారు. మిగిలిన 3 కాలనీల్లోని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్‌ను ఏపీ నుంచి నేర్చుకోవాలి



ఏపీ ప్రభుత్వ పాలన విధానాలు, అమలు చేస్తున్న సంస్కరణలు సత్ఫలితాలనిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, స్మార్ట్ గవర్నెన్స్ అద్భుతమంటూ దిల్లీ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. మంత్రులు లోకేశ్, భరత్‌తో సమావేశమైన దిల్లీ ప్రభుత్వ ప్రతినిధుల బృందం ఏపీ ప్రభుత్వ విధానాలపై అధ్యయనంతో పాటు పెట్టుబడుల ఆకర్షణ, డేటా ఆధారిత పాలనపై చర్చించింది.దిల్లీ అధికారులకు సహకారం: పబ్లిక్‌-ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏపీ దేశానికే మార్గదర్శిగా నిలుస్తోందని దిల్లీ ప్రభుత్వ ప్రతినిధులు కితాబిచ్చారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో మంత్రి లోకేశ్ దిల్లీ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏపీ పారిశ్రామికాభివృద్ధి విధానం ఎంతో ఆకర్షణీయంగా ఉందని దిల్లీ పరిశ్రమలశాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్? శిర్సా అన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలను తాము అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు సింగిల్? డెస్క్? విధానం అమలు చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ వివరించారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్స్? క్లస్టర్‌తో పాటు అమరావతి, తిరుపతి, విశాఖ ప్రాంతాలను ఎకనామిక్? జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ఏపీలో అమలు చేస్తున్న విధానాలపై మరింత అవగాహన కోసం దిల్లీ అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ప్రశంసలు: ఏపీ స్మార్ట్ గవర్నెన్స్ విధానాలపై దిల్లీ ప్రతినిధుల బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచింది. ప్రభుత్వంలోని వివిధ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేసి డేటా లేక్ ఏర్పాటు చేసినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. పలు వనరుల నుంచి సమాచారాన్ని సేకరించి నిరంతరం విశ్లేషించడం ద్వారా పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని పనితీరును ఎప్పటిక ప్పుడు అంచనా వేస్తున్నట్లు వివరించారు. మంత్రుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు పనితీరును పరిశీలిస్తూ ర్యాంకింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఏపీ ప్రభుత్వం డేటాను సమర్థంగా వినియోగిం చుకుని మంచి ఫలితాలు సాధిస్తోందని దిల్లీ మంత్రి ప్రశంసించారు. డేటా ఆధారిత పాలన, స్మార్ట్ గవర్నెన్స్‌లో ఏపీ అనుభవం తమకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ రంగాల్లో ఏపీ బృందాన్ని దిల్లీకి పంపి తమ అధికారులకు విధానాలను వివరించాలని కోరారు.అమరావతి రాజధాని నిర్మాణ పనులను చూసి ఆశ్చర్యానికి గురైనట్లు దిల్లీ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా అన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా నిలుస్తుందని అభిప్రాయప డ్డారు. సీఎం చంద్రబాబు విజన్‌ను ప్రశంసిం చడంతో పాటు ఆయన్ను విశ్వవిద్యాలయంతో పోల్చారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా పోస్టులను పూర్తి చేశారంటూ లోకేశ్‌ను దిల్లీ మంత్రి కొనియాడారు. దిల్లీలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ కోర్టు కేసులు, ఫిర్యాదులతో సంక్లిష్టంగా మారుతోందని తెలిపారు. ఏపీలో పారదర్శకంగా చేపట్టిన డీఎస్సీ నియామక విధానాన్ని తెలుసుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. త్వరలో మరో 3 వేల మందికిపైగా ఉపాధ్యాయులను నియమించనున్నట్లు లోకేశ్ చెప్పారు.మొత్తంగా ఏపీ పారిశ్రామిక విధానాలు, డేటా ఆధారిత పాలన, విద్యా సంస్కరణలు దిల్లీ ప్రభుత్వాన్ని ఆకట్టుకున్నాయి. రాష్ట్ర అనుభవాలను దిల్లీతో పంచుకునేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య విధానపరమైన సహకారం మరింత బలోపేతం కానుంది.

# తుంగభద్ర నీటి లభ్యతపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష తాగునీటికే తొలి ప్రాధాన్యం



రాయలసీమ ప్రాంతంలో జూలై 2027 వరకు తాగునీటి కొరత లేకుండా చూడటమే లక్ష్యంగా అందుబాటులో ఉన్న పరిమిత నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు, చెరువులను నింపడానికి మాత్రమే వినియోగించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. 'ఎల్ నినో' ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత, రాయలసీమకు నీటి కేటాయింపులపై ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.తాగునీటి పై సమీక్ష : అందుబాటులో ఉన్న పరిమిత నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు చెరువులను నింపడానికి వినియో గించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాయలసీమకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, తుంగభద్ర డ్యామ్ ఇంజనీర్లు, నీటిపారుదల సలహాదారు వెంకటే శ్వరరావు ఇంజనీర్-ఇన్-చీఫ్ నరసింహ మూర్తి పాల్గొన్నారు. 'ఎల్ నినో' వంటి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో, లో-లెవల్ కెనాల్ హై-లెవల్ కెనాల్ లకు నీటి కేటాయింపులు, వినియోగంపై ఆయన అధికారులు ఎమ్మెల్యేలతో చర్చించారు.నీటి నిర్వాహణ అమలు : ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌లోకి కేవలం 105 టీఎంసీల నీరు మాత్రమే వస్తుందని అంచనా వేస్తున్నట్లు, అందులో ఆంధ్రప్రదేశ్ వాటా 32.9 టీఎంసీలుగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఏపీ వాటాలో ఎూజకి 11.88 టీఎంసీలు, హూజకి 16.09 టీఎంసీలు ఖ-జ కెనాల్‌కు 4.95 టీఎంసీల నీటిని కేటాయించనున్నట్లు వారు వివరించారు. జూలై 2027 వరకు రాయలసీమలో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు నిమ్మల పేర్కొన్నారు. ఎలకెనాల్ హై-లెవల్ కెనాల్ లకు నీటి నినో పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం సూచించిందని మంత్రి వెల్లడించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రాయలసీమకు నీటి సరఫరాను కొనసాగించేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ విధానాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

# ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు



**అమరావతి, ఆగస్టు19:** ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ పరిపా లన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్ని కల్లో నేరు ఎంపికైన వారికి బలమైన ప్రజా మోదం ఉంటుందని అన్నారు. బుధవారం అసె ంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ చైర్మన్‌పై ఉండదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.అలాగే సుదీర్ఘ అభివృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని మేయర్, చైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు.అంతకుముందు అసెం బ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపిక ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగనుంది. ఇప్పటి వరకూ వీరిద్దరిని పద్ధతిలో ఎన్నుకుంటున్న సంగతి తెలిసిందే.

# ఏపీ మండలి డిప్యూటీ చైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ ఏకగ్రీవ ఎన్నిక



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మండలి డిప్యూటీ చైర్మన్ గా వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలిలో టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యుల కంటే వైసీపీ సభ్యులు మెజార్టీ సంఖ్యలో ఉండడంతో కూటమి తరుపున ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో బుధవారం మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. అనంతరం మాధవరావును చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టి అభినందించారు. ఈ కార్యక్రమానికి కూటమి సభ్యులు చైర్మన్ సీటు వద్దకు రాకపోవడంతో మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి సభ్యులు సభా సంప్రదాయాలను పాటించడం లేదని ఆరోపించారు. చైర్ పట్ల అగౌరవంగా వ్యవహరించడం మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, సభా సాంపరదాయాలు, గౌరవాలు శాశ్వతం అని అన్నారు.

# త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతా




త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్టు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రకటించారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుకను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలిపారు.త్వరలో రాజకీయ ప్రణాళిక: దేశం సుభిక్షంగా ఉండాలని, ఎల్‌నినో ప్రభావం లేకుండా సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ప్రశాంతంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు. విజయవాడలో మీడియా ప్రతినిధులతో తన కొత్త పార్టీ గురించి అన్ని వివరాలు చెబుతానన్నారు.విజయసాయి రెడ్డి వైఎస్సార్సీపీని వీడి కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ప్రచారం కొంతకాలంగా సాగుతుండగా, తిరుమల వేదికగా ఆయన చేసిన ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం నమోదైంది. కొత్త పార్టీ పేరు, ఎజెండా, విధివిధానాలు ఎలా ఉండబోతోందనే అంశంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గతంలోనూ కీలక వ్యాఖ్యలు: అయితే జులైలో మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని గతంలో ప్రకటించిన విజయసాయి రెడ్డి తాజాగా కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారు. ప్రజా పక్షంగా పనిచేస్తూ వారి గొంతుకగా నిలిచేలా పార్టీని తీర్చిదిద్దుతానని చెప్పారు. రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో వైఎస్సా ర్సీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు వాస్తవ పరిస్థితిని గుర్తించి ప్రజా సమస్య లపై దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలో మీడియా రంగంలోకి కూడా వస్తానని తెలిపా రు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన పూర్తి ప్రణాళికను ఈ నెలలోనే వెల్లడిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. విజయసాయిరెడ్డి గతేడాది రాజ్యసభ ఎంపీ పదవికి, రాజకీయా లకు రాజీనామా చేశారు. అప్పట్లో తాను ఇకపై ఏ పార్టీలో చేరనని, కేవలం వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించారు. కానీ ఇప్పుడు అనూహ్యంగా సరికొత్త రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. వైఎస్ కుటుంబంలో మూడు తరాలతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా విజయసాయిరెడ్డికి అను బంధం ఉంది. అలాంటి నేత ఇప్పుడు వైఎస్సా ర్సీపీకి గుడ్‌బై చెప్పి, సరికొత్త పార్టీతో పొలిటి కల్ రీ-ఎంట్రీ ఇస్తుండటం ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# విశాఖలో డేటా సెంటర్లపై విమర్శలు.. మంత్రి లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్




**అమరావతి, ఆగస్టు 19 :** విశాఖపట్నం డేటా సెంటర్లపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జనసేన ఎమ్మెల్యే నాగమాధవి డేటా సెంటర్లపై అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ఈ మేరకు సమాధానం ఇచ్చారు. డేటా సెంటర్ల నీటి వినియోగంపై దుష్ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత డిజిటల్ ఎకానమీకి డేటా సెంటర్లు అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. గూగుల్ పెట్టుబడితో విశాఖపై ఇతర ఐటీ కంపెనీలకు ఆసక్తి పెరిగిందని వ్యాఖ్యానించారు. డేటా సెంటర్ల ఎకోసిస్టమ్ 6.5 +ఔకు చేరితే ఏడాదికి సుమారు 3 టీఎంసీల నీరు అవసరమని వెల్లడించారు.ఆ నీటిని డేటా సెంటర్లకు మళ్లించం..కొత్త కూలింగ్ టెక్నాలజీలతో డేటా సెంటర్ల నీటి వినియోగం మరింత తగ్గుతుందని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు. డేటా సెంటర్లకు పోలవరం నీటిలో పారిశ్రామిక కేటాయింపుల నుంచే నీరు వస్తోందని వివరించారు. విశాఖ నగర ప్రజల నీటి అవసరాలకు కేటాయించిన నీటిని డేటా సెంటర్లకు మళ్లించమని స్పష్టం చేశారు. పోలవరం నుంచి విశాఖపట్నం నగరానికి గ్రావిటీ ద్వారా నీటి సరఫరాను 18 నెలల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. డేటా సెంటర్ల కోసం ప్రత్యేక పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. 1 +ఔ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్‌కు దాదాపు పదో వంతు నీరే అవసరమని వెల్లడించారు.అలా డేటా సెంటర్లను అభివృద్ధి చేస్తాం..థర్మల్ పవర్ ప్లాంట్ల నీటి వినియోగంపై కాకుండా డేటా సెంటర్లపైనే ఎందుకు నిరసనలు? చేస్తున్నారని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. డేటా సెంటర్ కేటాయింపులకు 6.5 +ఔ పరిమితి విధించినట్లు సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. 6.5 +ఔ డేటా సెంటర్ కేటాయింపుల లక్ష్యం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే కంపెనీలకే తమ ప్రభుత్వం ప్రయారిటీ ఇస్తుందని స్పష్టం చేశారు. విశాఖపట్నం ప్రజల నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డేటా సెంటర్ల అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# విజయవాడలో భారీ కార్పొరేట్ మోసం..



**విజయవాడ, ఆగస్టు 19 :** విజయవాడలో భారీ కార్పొరేట్ మోసం వెలుగులోకి వచ్చింది. తప్పుడు సమాచారంతో యూనియన్ బ్యాంక్ నుంచి రూ. 24 కోట్లను నిందితులు కొట్టేశారు. యూనియన్ బ్యాంక్ ద్వారా లోన్ తీసుకున్న డబ్బుతో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు చేయకుండా లోన్ మొత్తాన్ని షెల్ కంపెనీల ద్వారా నిందితులు మళ్లించారు. ఈ క్రమంలో ఆ బ్యాంకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 23.85 కోట్లకు బదులుగా కేవలం రూ.25 లక్షల నిల్వలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి సీబీఐకి యూనియన్ బ్యాంక్ ఏజీయం శ్రీకాంత్ పాత్రో ఫిర్యాదు చేశాడు. యూనియన్ బ్యాంక్ నుంచి ఓంకార విజయలక్ష్మి స్లైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోన్ తీసుకునట్లు ఆ బ్యాంక్ ఏజీయం తెలిపారు. బ్యాంక్ లోన్ రాగానే ఆరు నెలల్లోనే ఇద్దరు డైరెక్టర్ల రాజీనామా చేశారు. ఈ కేసులో నిందితులుగా డైరెక్టర్లు కోట భానుప్రసాద్, కోట శ్రావణి, కోట పృథ్వీ వెంకటతేజ, కోట రాహుల్ సాయి బాలాజీతో పాటు బ్యాంకు ఉద్యోగులను సీబీఐ అధికారులు చేర్చారు.

# తొలి టెస్టులో లంక చిత్తు..



**165 రన్స్ తేడాతో భారత్ ఘనవిజయం**

**10 వికెట్లతో చెలరేగిన మానవ్ సుతార్**

**సిరీస్ లో 1-0 ఆధిక్యంలో టీమ్ ఇండియా**

గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. దేశానికి ఇది ల్యాండ్‌మార్క్ 600వ టెస్ట్ మ్యాచ్ కాగా, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టు 165 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసి రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. డబ్ల్యూటీసీ (ఔజ) ఫైనల్ రేసులో అత్యంత కీలకమైన ఈ పోరులో యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు పడగొట్టి విజయకేతనం ఎగురవేశాడు. 372 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, బుధవారం ఐదో రోజు పోస్ట్ లంచ్ సెషన్‌లో 77.4 ఓవర్లలో 206 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో సోనాల్ దినుష (84) మరోసారి టాప్ స్కోరర్ గా నిలిచాడు. రెండో టెస్టు కొలంబోలో ఈనెల 23 నుంచి జరుగుతుంది. రెండో ఇన్నింగ్స్‌లో 24 ఏళ్ల మానవ్ సుతార్ అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో లంక వెన్నువిరిచాడు. కేవలం 55 రన్స్ మాత్రమే ఇచ్చి ఏకంగా 6 వికెట్లు పడగొట్టి తన తొలి 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో తీసిన 4 వికెట్లతో కలిపి మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 2/16 తో అద్భుత సహకారం అందించగా, పేసర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ దక్కించుకున్నారు. దినేష్ చండిమాల్ కంకషన్ కారణంగా వైదొలగడం, అతడి స్థానంలో వచ్చిన పసిందు సూరియబండార గోల్డెన్ డకౌట్ అవ్వడం లంకను కోలుకోలేని దెబ్బతీసింది. కెప్టెన్ ధనంజయ డి సిల్వా, సోనాల్ దినుష కాసేపు పోరాడినా భారత స్పిన్ దాడిని తట్టుకోలేకపోయారు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇండియా, సాయి సుదర్శన్ స్థానంలో నంబర్ 3 లో వచ్చిన దేవదత్ పడిక్కల్ క్లాసిక్ సెంచరీ (167) తో తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులు సాధించింది. కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో సోనాల్ దినుష సెంచరీ, నిరోషన్ డిక్వెల్లా (80) పోరాటంతో 284 రన్స్ చేయగా, ఇండియాకు 178 పరుగుల భారీ లీడ్ లభించింది.రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా 193 పరుగులకు ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ కేవలం 53 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి, టెస్ట్ క్రికెట్ చరిత్రలో వేగంగా 100 సిక్సర్లు కొట్టిన తొలి భారతీయ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. పడిక్కల్ 44, రాహుల్ 35 రన్స్ చేసి సహకరించారు. గాలేలో అత్యధిక విజయవంతమైన ఛేజ్ 344 మాత్రమే కాగా, 372 రన్స్ ఛేజింగ్‌లో లంక ఏ దశలోనూ విజయం వైపు సాగలేకపోయింది. చారిత్రక 600వ టెస్టులో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన గిల్ సేన డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో కీలకమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది.కాగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించినప్పటికీ భారత్ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ తర్వాతి స్థానంలోనే కొనసాగుతోంది. ఈ మ్యాచ్ ఫలితం అనంతరం భారత్ పాయింట్ పర్సంటేజీ పెరిగింది. కానీ టేబుల్‌లో పొజిషన్‌లలో మాత్రం ఎలాంటి తేడా లేదు. ప్రస్తుతం టీమ్‌ఇండియా 53.33 పర్సంటేజీతో ఐదో స్థానంలో ఉంది. తాజా మ్యాచ్ ఫలితం పట్టికలో ఏ జట్టు స్థానాన్ని కూడా ప్రభావితం చేయలేదు. అయితే భారత్ పర్సంటేజీ మాత్రం 48.15 నుంచి 53.33కు పెరిగింది.

అదే సమయంలో శ్రీలంక 41 నుంచి 33.33 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం భారత్ ఐదో ప్లేస్‌లో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు, బంగ్లాదేశ్ మాత్రం భారత్ కంటే మెరుగైన ప్లేస్‌లో ఉంది. ఆ జట్టు రీసెంట్‌గా ఆస్ట్రేలియాపై సాధించిన విజయమే అందుకు కారణం. బంగ్లా ప్రస్తుతం 66.67 పాయింట్ పర్సంటేజీతో నాలుగో స్థానంలో ఉంది. ఇక ఈ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 77.78 శాతంతో టాప్‌లో ఉంది. సౌతాఫ్రికా 75 శాతంతో రెండో స్థానంలో ఉంది. ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమ్‌ఇండియా ఇప్పటిదాకా 10 మ్యాచ్‌లు ఆడగా, అందులో ఐదింట నెగ్గింది. మరో నాలుగు టెస్టుల్లో ఓడిపోగా, ఒకటి డ్రా చేసుకుంది. ఈ సైకిల్‌లో భారత్ ఇంకా ఎనిమిది టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఫైనల్ చేరుకోవాలంటే ఇకపై గిల్ సేన ఆడనున్న ప్రతీ టెస్టు కీలకం అనే చెప్పాలి. ఈ సిరీస్‌లో భారత్ తమ తదుపరి మ్యాచ్ ఈనెల 23న కొలంబో వేదికగా ఆడనుంది. ఈ పర్యటన తర్వాత టీమ్‌ఇండియా ఈ ఏడాది నవంబర్‌లో న్యూజిలాండ్ వెళ్లాల్సి ఉంది. అక్కడ ఆతిథ్య జట్టుతో భారత్ రెండు మ్యాచ్‌ల సిరీస్ ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత సొంత గడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పోటీపడాల్సి ఉంది. ఈ సిరీస్ 2027 ఫిబ్రవరిలో ఉండే అవకాశం ఉంది. ఆసీస్‌పై బంగ్లాదేశ్ విజయం సాధించడంతో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే భారత్‌కు ఇకపై ఆడనున్న ప్రతి టెస్టు నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఎనిమిదింట్లో ఏడు నెగ్గి ఒకటి ఓడిపోతే అప్పుడు భారత్ 68.52 పర్సంటేజీతో ఉంటుంది. అదే ఆరు టెస్టుల్లో విజయం సాధించి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైతే పాయింట్ పర్సంటేజీ 62.96 గా ఉంటుంది. భారత జట్టుకు ఎటువంటి పెనాల్టీ పాయింట్లు విధించకపోతేనే ఈ పరిస్థితులు సాధ్యమవుతాయి. కాబట్టి, శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా రాబోయే సిరీస్‌ల్లో పొరపాట్లకు ఏమాత్రం తావు లేకుండా ఆడాల్సి ఉంటుంది.

# టీమిండియా మైండ్ గేమ్ అదుర్స్!



శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ ఐదో రోజు ఆటలో టీమ్ ఇండియా యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన మైండ్ గేమ్‌తో లంక వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్వెల్లాను బోల్తా కొట్టించాడు. బ్యాటింగ్ చేస్తున్న డిక్వెల్లాను క్లోజ్ ఫీల్డింగ్ లో ఉన్న జైస్వాల్ మాటలతో రెచ్చగొట్టి పెద్ద షాట్ ఆడేలా టెంప్ట్ చేశాడు. జైస్వాల్ వేసిన ఈ మైండ్ ట్రాప్ లో పడిన డిక్వెల్లా ఆ మరుసటి బంతికే భారీ షాట్ ఆడబోయి వికెట్ పారేసుకున్నాడు.డిక్వెల్లా క్రీజులో ఉన్నప్పుడు జైస్వాల్ దగ్గరగా వచ్చి మాటల యుద్ధం స్టార్ట్ చేశాడు. "కమాన్ యార్, ఫస్ట్ ఇన్నింగ్స్ లో ఎన్నో షాట్లు ఆడావు కదా, ఇప్పుడు ఏదైనా చూపించు. డీప్ స్క్వేర్ లెగ్ వైపు సిక్స్ కొట్టు" అని జైస్వాల్ రెచ్చగొట్టాడు. దీనికి డిక్వెల్లా రియాక్ట్ అవుతూ, "ఇప్పుడు అవసరం లేదు, నన్ను ఐపీఎల్ కు తీసుకెళ్ళు, అప్పుడు సిక్స్ కొట్టి చూపిస్తా" అని బదులిచ్చాడు. వెంటనే జైస్వాల్ స్పందిస్తూ "తప్పకుండా తీసుకెళ్తాం, నువ్వు ఒక్క సిక్సర్ కొట్టు, నిన్ను ఐపీఎల్ కు తీసుకెళ్లే బాధ్యత నాది" అని ఊరించాడు. ఈ మాటలతో ఏకాగ్రత కోల్పోయిన డిక్వెల్లా భారీ షాట్ కొట్టాలనే తొందరపాటులో పడ్డాడు. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వరుసగా సంధించిన షార్ట్ పిచ్ బౌన్సర్లలో ఒకదానిని ఆడే క్రమంలో బంతి ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతికి చిక్కింది. దాంతో లంక కీలక వికెట్ కోల్పోయింది. జైస్వాల్ తెలివిగా ఆడిన మైండ్ గేమ్ ఇండియాకు ఒక క్రూషియల్ బ్రేక్ త్రూ అందించింది. గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. భారత్ కు ఇది ల్యాండ్‌మార్క్ 600వ టెస్ట్ మ్యాచ్ కాగా, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టు 165 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసి రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో అత్యంత కీలకమైన ఈ పోరులో యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు పడగొట్టి విజయకేతనం ఎగురవేశాడు. 372 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, బుధవారం ఐదో రోజు పోస్ట్ లంచ్ సెషన్‌లో 77.4 ఓవర్లలో 206 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో సోనాల్ దినుష (84) మరోసారి టాప్ స్కోరర్ గా నిలిచాడు. రెండో టెస్టు కొలంబోలో ఈనెల 23 నుంచి జరుగుతుంది.



# మూడో స్థానంపై చర్చలను కొట్టిపడేసిన పడిక్కల్

**స్పోర్ట్స్ డెస్క్:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చిన దేవదత్ పడిక్కల్(167) అద్భుతమైన శతకం చేశాడు. దీంతో దాదాపు రెండేళ్ల తర్వాత భారత తరఫున టెస్టుల్లో వన్ డౌన్ బ్యాటర్ సెంచరీ చేశాడు. సాయి సుదర్శన్ గాయం కారణంగా దూరం కావడంతో వచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ కంటే ముందు జరిగిన వార్మప్ మ్యాచ్‌లోనూ పడిక్కల్ సెంచరీతో మెరిశాడు. దీంతో మూడో స్థానంలో అద్భుతమైన ప్లేయర్ దొరికాడని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అంతేకక కొందరు అయితే సాయి సుదర్శన్‌తో పడిక్కల్‌ను పోలుస్తున్నారు.వన్‌డౌన్ బ్యాటింగ్ విషయంలో వస్తున్న చర్చలపై పడిక్కల్ స్పందిస్తూ... తాను ఇలాంటి రేస్‌కు దూరంగా ఉంటానని.. అవకాశం వచ్చినప్పుడు ఏ స్థానంలోనైనా నిరూపించుకోవడానికి సిద్ధమని స్పష్టం చేశాడు. మూడో స్థానం తనకు సుదీర్ఘం కాలం వచ్చేసినట్లు బయట చాలా చర్చ సాగుతోందని, కానీ, తనకు అలాంటివి ఇష్టం ఉండదని తెలిపాడు. ఎప్పుడు, ఏ స్థానంలో అవకాశం వచ్చినా సిద్ధంగా ఉంటానని, అంతేకానీ, ఎంపిక గురించి తనకు ఎలాంటి ఆందోళన లేదని పడిక్కల్ వెల్లడించాడు.పోటీ ఎక్కువ ఉన్న సమయంలో ఇక్కడ ఆటే కొలమానమని, మనం బాగా ఆడకపోతే జట్టులో కొనసాగడం కష్టమని క్రీడల్లోనే కాదు.. ఉద్యోగంలోనూ అంతేనని పేర్కొన్నాడు. సరైన ప్రదర్శన ఇవ్వకపోతే అవకాశాలు రావని, ఛాన్స్ వస్తే మాత్రం పరుగులు చేసేందుకు వందశాతం ప్రయత్నిస్తామని, అలా చేస్తే మరిన్ని మ్యాచులు ఆడొచ్చని తెలుసని పడిక్కల్ తెలిపాడు.

# కోహ్లీ సలహాలు నా జీవితాన్నే మార్చేశాయి: ఇంగ్లండ్ క్రికెటర్

**స్పోర్ట్స్ డెస్క్:** టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీకి సామాన్యులతో పాటు సెలబ్రిటీల్లో కూడా అభిమానులు ఉన్నారు. అంతేకాక అతడు ఎంతో మందికి యువ ప్లేయర్లకు స్ఫూర్తిగా నిలిచాడు. ఇక అంతర్జాతీయ, దేశవాళీ, ఇతర లీగ్స్ సమయంలో తన సహచరులకు విలువైన సలహాలు ఇచ్చేవాడు. ఈ క్రమంలోనే కోహ్లీ సలహాలతో తమలో మార్పులు వచ్చిందని అనేక మంది యువ క్రికెటర్లు తెలిపారు. తాజాగా ఇంగ్లండ్ యువ క్రికెటర్ కూడా కింగ్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. మరి.. ఆ ప్లేయర్ ఎవరు, ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...ఓ ఇంటర్నేషనల్ ఛానల్‌తో ఇంగ్లండ్ యువ క్రికెటర్ జార్డన్ కాక్స్ మాట్లాడుతూ.. కోహ్లీ గురించి పలు విషయాలను వెల్లడించాడు. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున తుది జట్టులో ఆడే అవకాశం దక్కలేదని, అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్‌తో గడిపిన క్షణాలు తన జీవితాన్నే మార్చేశాయని కాక్స్ వెల్లడించారు.క్రికెట్‌లో పెద్ద మ్యాచులు, అరంగేట్రం సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో కోహ్లీ తనకు అద్భుతమైన సలహా ఇచ్చాడని కాక్స్ తెలిపాడు. జీవితంలో ఒక్కసారే అరంగేట్రం వస్తుందని, మన కష్టపడిన వారి త్యాగాలను గుర్తుంచుకుని మైదానంలో ప్రతిభను చాటుకోమని కోహ్లీ ధైర్యం చెప్పినట్లు అతడు గుర్తుచేసుకున్నాడు.న్యూజిలాండ్‌తో జరగాల్సిన తన తొలి టెస్ట్ మ్యాచ్‌కు కేవలం మూడు రోజుల ముందు గాయపడటంతో కాక్స్ మానసికంగా కుంగిపోయాడు. ఆ సమయంలో ఇక క్రికెట్ ఆడలేనేమోనని భయపడిన తనకు కోహ్లీ చెప్పిన మాటలు ధైర్యాన్ని ఇచ్చాయని కాక్స్ తెలిపాడు. మైదానంలో కోహ్లీ ఎంత దూకుడుగా ఉంటాడో, బయట అంతకంటే వినయంగా, దయ ఉంటాడని అతడు పేర్కొన్నాడు. మైదానంలో అగ్రెసివ్‌గా ఉంటూనే, బయట వారితో ఎలా ప్రవర్తించాలనేది కోహ్లీని చూసి నేర్చుకున్నానని కాక్స్ వెల్లడించాడు.

# రవీంద్ర జడేజా సరికొత్త చరిత్ర..

శ్రీలంకతో గాలే అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జడేజా, టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల టెస్ట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న జడేజా, మూడో రోజు ఆటలో లంక బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు సోమవారం ఉదయం సెషన్‌లో శ్రీలంక టెస్ట్ కెప్టెన్ ధనంజయ డి సిల్వాను ఔట్ చేయడం ద్వారా జడేజా తన వికెట్ల ఖాతాను తెరిచాడు. అనంతరం మూడో సెషన్‌లో కేశర నువాంత వికెట్‌ను పడగొట్టి తన టెస్ట్ కెరీర్‌లో 350 వికెట్ల మైలురాయిని లాంఛనంగా అధిగమించాడు. 2012లో టీమిండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన జడేజా, గాలేలో తన 90వ టెస్ట్ మ్యాచ్ ఆడుతూ ఈ ఘనత సాధించడం విశేషం. టెస్ట్ క్రికెట్ చరిత్రలో భారత్ తరఫున 350 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టిన ఐదో బౌలర్‌గా జడేజా రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 619 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు (1990-2008 మధ్య 132 టెస్టులు). కుంబ్లే తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (537 వికెట్లు), కపిల్ దేవ్ (434 వికెట్లు), హర్భజన్ సింగ్ (417 వికెట్లు) ఉన్నారు. ఇప్పుడు వారి సరసన జడేజా సగర్వంగా నిలిచాడు. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా, ఆల్ రౌండర్‌గానూ జడేజా ప్రపంచ స్థాయి రికార్డును నెలకొల్పాడు. టెస్టుల్లో 4,000 కంటే ఎక్కువ పరుగులు చేసి, 350కి పైగా వికెట్లు తీసిన ప్రపంచంలోనే నాలుగో క్రికెటర్‌గా, భారత్ తరఫున దిగ్గజం కపిల్ దేవ్ తర్వాత రెండో ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచ క్రికెట్



చరిత్రలో ఈ ఘనత సాధించిన దిగ్గజాల జాబితాలో.. కపిల్ దేవ్ ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. అతడు 131 టెస్టుల్లో 5,248 పరుగులు, 434 వికెట్లు సాధించాడు. ఇయాన్ బోథమ్ (ఇంగ్లాండ్).. 102 టెస్టుల్లో 5,200 పరుగులు, 383 వికెట్లు.. డేనియల్ వెట్టోరి (న్యూజిలాండ్).. 113 టెస్టుల్లో 4,531 పరుగులు, 362 వికెట్లు.. రవీంద్ర జడేజా (భారత్).. 90 టెస్టుల్లో 4,108 పరుగులు.. 350ం వికెట్లు జూన్ 2026లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు ఎంపిక కాని జడేజా, లంకతో సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చి సత్తా చాటాడు. ఇప్పటివరకు 134 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో 4,108 పరుగులు పూర్తి చేసిన జడేజా, ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 13 పరుగులు చేశాడు. తాజా ప్రదర్శనతో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు.



# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

## - వాయిదా వార్తలను ఖండించిన టీమ్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పు లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్



పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వియత్నాం టూర్‌లో సమంత, రాజ్ నిడుమోరు

టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రస్తుతం వియత్నాంలో తన భర్త, ప్రముఖ దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరు తో కలిసి బేబీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే తాము మొదటి బిడ్డకు స్వాగతం పలకబోతున్న నేపథ్యంలో, ఈ ప్రత్యేకమైన క్షణాలను ఆస్వాదించేందుకు ఈ క్యూట్ కపుల్ వియత్నాం వెకేషన్‌కు వెళ్లారు.అక్కడి సుందరమైన ప్రదేశాలను చుట్టేయడంతో పాటు, పలు రకాల ఫన్ యాక్టివిటీస్‌లో సమంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అక్కడి ప్రత్యేకమైన స్థానిక ఫుడ్‌ను టేస్ట్ చేస్తూ ఎంజాయ్ చేసిన వీడియోలు, ఫోటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ బేబీమూన్ పిక్స్ మరియు వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా, టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.






# టాక్సిక్ .. పెద్దల సినిమా మాత్రమే

## - పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.

# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# ఓటిటిలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే




ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888